www.prajanaava.in

Telugu Daily

ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల రూ.5.00

ప్రజానావ ప్రతి అక్షరం జనం కోసం..

పాఠక మహాశయులకు విజ్ఞప్తి

తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి! వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

C : 99484 33277 / 9014966169

Published from: Hyderabad, Rangareddy, Karimnagar Circulated to: Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 192 | మంగళవారం | 7 జులై, 2026



కష్టంగా ఖరీఫ్!

- ఈసారి ఆశించిన మేర కురవని వానలు
- గతేడాదితో పోలిస్తే 21శాతం తగ్గిన సాగు విస్తీర్ణం
- దేశవ్యాప్తంగా 350.85 లక్షల హెక్టార్లకే పరిమితం
- వరి సహా పప్పు, నూనెగింజలు, ముతక ధాన్యాలు, పత్తిపైనా ప్రభావం

2



116 ఏళ్ల వయసులో అలిపిరి నుంచి కాలినడకన తిరుమలకు చేరుకున్న తమిళనాడుకు చెందిన నవనీతమ్మకు టీటీడీ వీఐపీ బ్రేక్ దర్శనం కల్పించింది. వైరల్‌గా మారిన వీడియో ఆధారంగా టీటీడీ విజిలెన్స్ ఆమెను గుర్తించగా, చైర్మన్ బీఆర్ నాయుడు ఆదేశాల మేరకు కుటుంబసభ్యులతో కలిసి దర్శనం ఏర్పాటు చేశారు. రంగనాయకుల మండపంలో టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర వేదపండితులతో ఆశీర్వచనం చేయించి, పట్టువస్త్రం, తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం నవనీతమ్మకు నమస్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు.

– ప్రజానావ, తిరుమల



మూడు దేశాల పర్యటనకు

మోదీ శ్రీకారం

- జకార్తాలో ఘన స్వాగతం.. యుద్ధ విమానాల ఎస్కార్ట్‌తో అరుదైన గౌరవం
- ఇండోనేసియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాలతో ద్వైపాక్షిక చర్చలు
- వాణిజ్యం, రక్షణ, ఇండో–పసిఫిక్ సహకారంపై కీలక సమావేశాలు

2

టూరిజంపై ఫోకస్

ప్రధాన పర్యాటక కేంద్రాల సమగ్ర అభివృద్ధికి కార్యాచరణ

- తారామతి బారాదరి, దుర్గం చెరువులకు అంతర్జాతీయ స్థాయి హంగులు
- వికారాబాద్, ఫ్యూచర్ సిటీ, హెరిటేజ్ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి
- పర్యాటక శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌కు ఇప్పటినుంచే పెట్టుబడులు ఆకర్షించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశం

ప్రజానావ, హైదరాబాద్: రాష్ట్రంలోని పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేసే దిశగా సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని తారామతి బారాదరి, దుర్గం చెరువును పూర్తిస్థాయి పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా పర్యాటక అవకాశాలున్న ప్రాంతాలను గుర్తించి, వాటి అభివృద్ధికి కార్యాచరణ చేపట్టాలని స్పష్టం చేశారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో సోమవారం నిర్వహించిన పర్యాటక శాఖ సమీక్ష సమావేశంలో సీఎం పలు కీలక సూచనలు చేశారు. టూరిజం హబ్ డెవలప్‌మెంట్ పథకం కింద వికారాబాద్ ప్రాంతాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయాలని సీఎం ఆదేశించారు. అక్కడి వీరభద్రస్వామి ఆలయ అభివృద్ధికి యాదాద్రి తరహాలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే మంజీరా, దిల్‌కుషా అతిథి గృహాలను ఆధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ పరిసరాల్లోని అటవీ శాఖ భూములను ఎకో టూరిజం కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. గుర్రంగూడ ఎకో పార్కు సమూనాలో నగరంలో మరిన్ని పార్కులను ఏర్పాటు చేయాలని, ఫ్యూచర్ సిటీలోని అటవీ ప్రాంతాలను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని తరువాయి 2లో..





నేటితో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తికావాలి

- పట్టణ జిల్లాల్లో ప్రత్యేక దృష్టి సారించాలి
- బీఎల్ఓల పనితీరును పర్యవేక్షిస్తూ సూపర్‌వైజర్లు సహకరించాలి
- ఎస్ఐఆర్ ప్రక్రియపై కలెక్టర్లతో సీఈసీ వీడియో కాన్ఫరెన్స్

ప్రజానావ, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ఓటర్ల ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీని మంగళవారం నాటికి ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ముఖ్యంగా హైదరాబాద్, మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలతో పాటు పట్టణ ప్రాంతాల్లో ఫారాల పంపిణీపై ప్రత్యేక దృష్టి సారించి వంద శాతం పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదనపు ప్రధాన ఎన్నికల అధికారి వాసం వెంకటేశ్వర్లుతో కలిసి సోమవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన సుదర్శన్ రెడ్డి, ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ, పరిశీలన, డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం తరువాయి 2లో..



2

కాళేశ్వరం కట్టింది మీరే.. కూల్చుకుందీ మీరే!

- ప్రాజెక్టు పేరుతో వేల కోట్లు ఖర్చు చేసి పేదలకు కూడా ఇళ్లు కట్టలేదు
- కాళేశ్వరంపై సమాధానం చెప్పేందుకు కేసీఆర్ అసెంబ్లీకి రావాలి
- అసంపూర్తి డబుల్ బెడ్‌రూం ఇళ్లన్నీ పూర్తిచేసి పేదలకు అందిస్తాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

ముంబై గజగజ

మహారాష్ట్రను ముంచెత్తిన వానలు

- 24 గంటల్లో 600 మి.మీ. వర్షం
- ముంబై–పుణె రైలు మార్గం అస్తవ్యస్తం
- పట్టాల పునరుద్ధరణకు ముమ్మరంగా పనులు
- అప్రమత్తతతో తప్పిన పెను ప్రమాదం
- 27 రైళ్లు రద్దు, 57 దారి మళ్లింపు
- పలుచోట్ల విరిగిపడ్డ కొండచరియలు
- పుణెలో కోట గోడ కూలి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణం
- ఇల్లు కూలి ఒడిశాలో రెండేళ్ల చిన్నారి మృతి

6



రెండేళ్లలో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పూర్తి

- కార్మికుల భద్రతలో ఎలాంటి రాజీ లేదు
- ప్రాజెక్టు పూర్తితో 4.01 లక్షల ఎకరాలకు సాగునీరు
- 618 ఫ్లోరైడ్ బాధిత గ్రామాలకు సురక్షిత తాగునీటి భరోసా
- సిబ్బందిని పెంచి టన్నెల్, రిజర్వాయర్లు, కాలువల పనులను వేగవంతం చేశాం
- నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



ప్రజానావ, హైదరాబాద్: దక్షిణ తెలంగాణ రైతుల చిరకాల ఆకాంక్ష అయిన ఎలిమినేటి మాధవరెడ్డి శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్ఎల్‌బీసీ) ప్రాజెక్టును 2028 జూన్ నాటికి పూర్తి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రాజెక్టు పనులను వేగవంతం చేస్తూనే కార్మికుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని ఆయన తేల్చిచెప్పారు. డా.బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో సోమవారం ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించిన మంత్రి, ఇది కేవలం నిర్మాణ ప్రాజెక్టు మాత్రమే కాదని, దక్షిణ తెలంగాణ అభివృద్ధికి కీలకమైన జీవనాడి అని పేర్కొన్నారు. అవసరమైన నిధులు, భూసేకరణ, సాంకేతిక, పరిపాలనా అనుమతులను వేగంగా పూర్తి చేసి పనులు నిరంతరాయంగా కొనసాగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. అత్యాధునిక తరువాయి 2లో..



భగీరథ్ బెయిల్‌పై తీర్పు రిజర్వ్

- పోక్సో కేసులో ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు
- బెయిలిస్తే సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందన్న ప్రభుత్వం
- దర్యాప్తు పూర్తయ్యే వరకూ బెయిల్ ఇవ్వొద్దని బాధితురాలి తరఫున విజ్ఞప్తి

2

ఉక్రెయిన్‌పై విరుచుకుపడ్డ రష్యా

- క్షిపణులు, డ్రోన్ల దాడుల్లో 21మంది మృతి
- విమాన రక్షణలో లోపాలు బహిర్గతం
- పేట్రియట్ క్షిపణుల కొరతపై జెలెన్‌స్కీ ఆందోళన



2



ప్రతీకార నినాదాలతో మార్మోగిన అంతిమయాత్ర

టెహ్రాన్: ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీకి దేశ ప్రజలు భావోద్వేగ వీడ్కోలు పలికారు. టెహ్రాన్‌లో నిర్వహించిన ఆయన అంతిమయాత్రలో లక్షలాది మంది పాల్గొని నివాళులర్పించారు. నల్ల దుస్తులు ధరించిన ప్రజలు భారీ సంఖ్యలో వీధుల్లోకి తరలివచ్చి శోకసంద్రంగా మారారు. ఇదే సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రతీకారం తీర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఖమేనీతో పాటు యుద్ధ ప్రారంభంలో వైమానిక దాడిలో మరణించిన ఆయన కుటుంబ సభ్యుల శవపేటికలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఊరేగించారు. అంతిమయాత్రలో పాల్గొన్నవారు శవపేటికను తాకేందుకు పోటీపడగా, కొందరు తమ వస్త్రాలను శవపేటికకు తాకించి ఆశీర్వాదంగా భావించారు. ట్రంప్, నెతన్యాహూల బొమ్మలు, వ్యతిరేక నినాదాలతో ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఖమేనీ మరణానికి ప్రతీకారం తప్పదని పలువురు ప్రకటించారు. భారీగా తరలివచ్చిన ప్రజలను నియంత్రించేందుకు అధికారులు విస్తృత భద్రతా ఏర్పాట్లు చేశారు. టెహ్రాన్ వీధుల మీదుగా దాదాపు 12 గంటలపాటు సాగిన అంతిమయాత్ర అనంతరం ఖమేనీ భౌతికకాయాన్ని మెహ్రాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి తరలించారు. ఆయన స్వస్థలమైన మష్హద్‌లోని ఇమామ్ రేజా పవిత్ర దర్గా వద్ద అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఖమేనీ మృతి నేపథ్యంలో దేశవ్యాప్తంగా గురువారం వరకు అధికారిక సంతాప దినాలు కొనసాగనున్నాయి.

చర్చలకు విరామం

ఖమేనీ అంత్యక్రియల నేపథ్యంలో అమెరికా–ఇరాన్ మధ్య కొనసాగుతున్న యుద్ధ విరమణ, అణు కార్యక్రమం, హోర్ముజ్ జలసంధి అంశాలపై చర్చలు తాత్కాలికంగా నిలిచిపోయాయి. అంత్యక్రియలు ముగిసిన తర్వాతే చర్చలు తిరిగి ప్రారంభమయ్యే అవకాశముందని దౌత్య వర్గాలు భావిస్తున్నాయి. కాగా, కొత్త సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టిన అయతొల్లా మొజ్తబా ఖమేనీ ఇప్పటివరకు బహిరంగంగా కనిపించలేదు. భద్రతా కారణాల దృష్ట్యా ఆయన రహస్య ప్రదేశంలో ఉన్నట్లు సమాచారం.

మూడు దేశాల పర్యటనకు మోదీ శ్రీకారం

- **జకార్తాలో ఘన స్వాగతం.. యుద్ధ విమానాల ఎస్కార్ట్‌తో అరుదైన గౌరవం**
- **ఇండోనేసియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాలతో ద్వైపాక్షిక చర్చలు**
- **వాణిజ్యం, రక్షణ, ఇండో-పసిఫిక్ సహకారంపై కీలక సమావేశాలు**



న్యూఢిల్లీ: భారత్ 'యాక్ట్ ఈస్ట్' విధానం, 'మహాసాగర్' విజన్‌కు మరింత బలం చేకూర్చే లక్ష్యంతో ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం ఇండోనేసియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌ల ఆరు రోజుల విదేశీ పర్యటనను ప్రారంభించారు. ఈ నెల 11 వరకు కొనసాగే ఈ పర్యటనలో ఆయా దేశాల అధినేతలతో ద్వైపాక్షిక సంబంధాలు, వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ సహకారం, ఇండో-పసిఫిక్ ప్రాంతీయ అంశాలపై విస్తృతంగా చర్చించనున్నారు. అలాగే భారతీయ ప్రవాసులతో సమావేశమై, పారిశ్రామికవేత్తలతోనూ భేటీ కానున్నారు. మోదీ ప్రయాణిస్తున్న ప్రత్యేక విమానం ఇండోనేసియా గగనతలంలోకి ప్రవేశించగానే ఆ దేశ వైమానిక దళానికి చెందిన యుద్ధ విమానాలు ఎస్కార్ట్ ఇవ్వడం విశేషం. జకార్తా విమానాశ్రయంలో ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో స్వయంగా స్వాగతం పలికారు. ఈ ఆతిథ్యానికి కృతజ్ఞతలు తెలుపుతూ మోదీ సామాజిక మాధ్యమాల్లో స్పందించారు. ఇరు దేశాల భాగస్వామ్యాన్ని అన్ని రంగాల్లో మరింత విస్తరించేందుకు కలిసి పనిచేస్తామని పేర్కొన్నారు.

ఇండోనేసియాలో కీలక కార్యక్రమాలు

జులై 8 వరకు ఇండోనేసియాలో పర్యటించే ప్రధాని మోదీ అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతోతో సమావేశమై ద్వైపాక్షిక సంబంధాల పురోగతిని సమీక్షించనున్నారు. అనంతరం భారతీయ ప్రవాసులను ఉద్దేశించి నిర్వహించే సభలో ప్రసంగించనున్నారు. యునెస్కో ప్రపంచ వారసత్వ జాబితాలోని యోగ్యకర్త ప్రాంతంలోని ప్రసిద్ధ ప్రంబనన్ ఆలయ సముదాయాన్ని కూడా సందర్శించనున్నారు. ప్రధానిగా మోదీ ఇండోనేసియాలో పర్యటించడం ఇది నాలుగోసారి.

ఆస్ట్రేలియాలో సీఈఓల ఫోరం

ఇండోనేసియా పర్యటన అనంతరం 8 నుంచి 10 వరకు ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో మోదీ పర్యటించనున్నారు. ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్‌తో ద్వైపాక్షిక చర్చలు జరపడంతో పాటు గవర్నర్ జనరల్ సామ్ మోస్టిన్‌ను మర్యాదపూర్వ కంగా కలుసుకోనున్నారు. భారత్–ఆస్ట్రేలియా సీఈఓల ఫోరంలో పాల్గొని వ్యాపార వర్గాలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. అలాగే 'మెల్‌బోర్న్ మీట్స్ మోదీ' కార్యక్రమంలో భారతీయ ప్రవాసులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు.

యాక్ట్ ఈస్ట్‌కు మరింత బలం

పర్యటనకు ముందు విడుదల చేసిన ప్రకటనలో మోదీ, ఈ మూడు దేశాల పర్యటనలు భారత 'యాక్ట్ ఈస్ట్' విధానం, 'మహాసాగర్' దృక్పథాన్ని మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు. స్వేచ్ఛాయుత, బహిరంగ, సమ్మిళిత ఇండో–పసిఫిక్ ప్రాంత నిర్మాణానికి భారత్ కట్టుబడి ఉందనే సందేశాన్ని ఈ పర్యటన ప్రపంచానికి చాటుతుందని ఆయన పేర్కొన్నారు.

న్యూజిలాండ్‌లో చారిత్రక పర్యటన

10, 11 తేదీల్లో న్యూజిలాండ్‌లో పర్యటించనున్న ప్రధాని మోదీ, ఆ దేశ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్‌తో సమావేశమై వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ సహకారం, ఇండో–పసిఫిక్ వ్యూహాత్మక భాగస్వామ్యంపై చర్చించనున్నారు. దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత న్యూజిలాండ్‌ను సందర్శిస్తున్న తొలి భారత ప్రధానమంత్రిగా మోదీ నిలవనున్నారు. ఆక్లాండ్‌లో భారతీయ ప్రవాసులతో సమావేశమై, వ్యాపార, క్రీడా రంగ ప్రముఖులతోనూ భేటీ కానున్నారు.





ఉక్రెయిన్‌పై విరుచుకుపడ్డ రష్యా

- **క్షిపణులు, డ్రోన్ల దాడుల్లో 21మంది మృతి**
- **విమాన రక్షణలో లోపాలు బహిర్గతం**
- **పేట్రియట్ క్షిపణుల కొరతపై జెలెన్‌స్కీ ఆందోళన**

కీవ్: ఉక్రెయిన్‌పై రష్యా మరోసారి భారీ స్థాయిలో క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడింది. సోమవారం తెల్లవారుజామున జరిగిన వరుస దాడుల్లో రాజధాని కీవ్‌తో పాటు పలు ప్రాంతాల్లో కనీసం 21 మంది ప్రాణాలు కోల్పోగా, 70 మందికిపైగా గాయపడ్డారు. కీవ్‌లోనే 15 మంది మృతి చెందగా, శిథిలాల కింద చిక్కుకున్న వారి కోసం సహాయక బృందాలు గాలింపు కొనసాగిస్తున్నాయి. రాత్రికి రాత్రే రష్యా 351 డ్రోన్లు, 68 క్షిపణులను ప్రయోగించిందని ఉక్రెయిన్ వైమానిక దళం వెల్లడించింది. ప్రయోగించిన 29 బాలిస్టిక్ క్షిపణులన్నీ లక్ష్యాలను తాకాయని తెలిపింది. అమెరికా తయారీ పేట్రియట్ ఇంటర్‌సెప్టర్ క్షిపణుల కొరత కారణంగా బాలిస్టిక్ దాడులను సమర్థంగా అడ్డుకోలేకపోతున్నామని అధికారులు పేర్కొన్నారు.

నాటో దేశాలకు జెలెన్‌స్కీ విజ్ఞప్తి

దాడుల అనంతరం అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ స్పందిస్తూ, డ్రోన్లు, క్రూయిజ్ క్షిపణులను ఎదుర్కొంటున్నప్పటికీ బాలిస్టిక్ క్షిపణుల విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. మిత్రదేశాల వద్ద ఉన్న పేట్రియట్ వ్యవస్థలను ఉక్రెయిన్‌కు అందించాలని, పౌరుల ప్రాణాలను కాపాడేందుకు మరింత వైమానిక రక్షణ అవసరమని నాటో దేశాలకు విజ్ఞప్తి చేశారు. కీవ్‌లోని ఆయుధాల తయారీ కేంద్రాలు, డ్రోన్లు, క్షిపణులు, సాయుధ వాహనాల ఉత్పత్తి యూనిట్లు, ఇంధన మౌలిక వసతులనే లక్ష్యంగా చేసుకుని దాడులు నిర్వహించామని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. అయితే దాడుల్లో భారీగా నివాస భవనాలు ధ్వంసమవడంతో సాధారణ ప్రజలే ఎక్కువగా ప్రాణాలు కోల్పోయారు.

రష్యాపై ఎదురుదాడి

మరోవైపు ఉక్రెయిన్ కూడా రష్యాలోని కీలక లక్ష్యాలపై డ్రోన్లతో ఎదురుదాడులు కొనసాగించింది. సైబీరియాలోని ఒమ్స్క్ చమురు శుద్ధి కర్మాగారంతో పాటు పలు ఇంధన, సైనిక కేంద్రాలపై దాడులు చేసినట్లు ఉక్రెయిన్ సైన్యం వెల్లడించింది. రష్యా వైమానిక దళం 519 ఉక్రెయిన్ డ్రోన్లను కూల్చివేసినట్లు ప్రకటించింది. క్రిమియాలో విద్యుత్ సరఫరాకు కూడా అంతరాయం ఏర్పడినట్లు అధికారులు తెలిపారు.

సీపీఐ నేత కుటుంబానికి చాడ పరామర్శ

ప్రజానావ, కరీంనగర్ : చిగురుమామిడి మండలంలోని గాగిరెడ్డిపల్లిలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సీపీఐ సీనియర్ నాయకులు దొంతరవేణి వెంకన్న కుటుంబాన్ని సోమవారం సీపీఐ జాతీయ నేత చాడ వెంకటరెడ్డి, జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ పరామర్శించారు. వెంకన్న సీపీఐకి అంకిత భావంతో పనిచేస్తూ విధేయుడుగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేశాడని అన్నారు. గ్రామ కార్యదర్శి, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా పార్టీ అప్పగించిన బాధ్యతలను తూచా తప్పకుండా అమలు చేసే వాడని కొనియాడారు. వెంకన్న మృతి పార్టీకి తీరని లోటన్నారు. వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. వీరి వెంట రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అందే స్వామి, మండల కార్యదర్శి నాగేల్లి లక్ష్మారెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కాంతాల శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమాస్తుల కేసులో డీఎస్పీ భీమ్‌రెడ్డి అరెస్ట్

- **ఏసీబీ సోదాల అనంతరం చర్యలు వేగవంతం**
- **సుమారు 2 కిలోల బంగారం, 20 కిలోల వెండి, కీలకపత్రాల స్వాధీనం**
- **ఆస్తుల మూలాలపై సమగ్ర దర్యాప్తు కొనసాగిస్తున్న దర్యాప్తు సంస్థ**

ప్రజానావ, హైదరాబాద్: ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలపై నమోదైన కేసులో డీఎస్పీ భీమ్‌రెడ్డిని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు సోమవారం అరెస్ట్ చేశారు. ఇటీవల నిర్వహించిన విస్తృత సోదాల్లో భారీ మొత్తంలో ఆస్తులు వెలుగులోకి రావడంతో ఆయనపై చట్టపరమైన చర్యలను ఏసీబీ వేగవంతం చేసింది. ఐదు రోజుల క్రితం భీమ్‌రెడ్డితో పాటు ఆయన కుటుంబ సభ్యులు, బంధువులకు సంబంధించిన నివాసాలు, ఇతర ప్రాంతాల్లో తెలంగాణవ్యాప్తంగా 16 చోట్ల ఏసీబీ అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఈ దాడుల్లో భారీ మొత్తంలో విలువైన ఆస్తులు, నగలు, కీలక పత్రాలు లభ్యమైన ట్లు అధికారులు వెల్లడించారు. సోదాల సందర్భంగా సుమారు రెండు కిలోల బంగారం, 20 కిలోల వెండి, 23 విదేశీ మద్యం సీసాలతో పాటు స్థిర, చరాస్తులకు సంబంధించిన పలు కీలక పత్రాలను ఏసీబీ అధికారు లు స్వాధీనం చేసుకున్నారు. వీటి ఆధారంగా ఆస్తుల విలువ, వాటి మూలాలు, కుటుంబ సభ్యుల పేర్లపై నమోదైన ఆస్తుల వివరాలను అధికారులు పరిశీలిస్తున్నారు.

ఆరోగ్యం మెరుగుపడిన తర్వాత అరెస్ట్

సోదాల అనంతరం భీమ్‌రెడ్డి అస్వస్థతకు గురికావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఆరోగ్య పరిస్థితి మెరుగుపడిన తర్వాత ఆయనను అధికారికంగా అరెస్ట్ చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఆస్తులకు సంబంధించిన పూర్తి వివరాలు, వాటి చట్టబద్ధతపై ఏసీబీ సమగ్ర దర్యాప్తు కొనసాగిస్తోంది. డీఎస్పీ స్థాయి అధికారిపై అక్రమాస్తుల కేసులో అరెస్టు జరగడం రాష్ట్రవ్యాప్తం గా చర్చనీయాంశంగా మారగా, విచారణలో మరిన్ని కీలక అంశాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

కాళేశ్వరం కట్టింది మీరే.. కూల్చుకుందీ మీరే!

- **ప్రాజెక్టు పేరుతో వేల కోట్లు ఖర్చు చేసి పేదలకు కూడా ఇళ్లు కట్టలేదు**
- **కాళేశ్వరంపై సమాధానం చెప్పేందుకు కేసీఆర్ అసెంబ్లీకి రావాలి**
- **అసంపూర్తి డబుల్ బెడ్‌రూం ఇళ్లన్నీ పూర్తిచేసి పేదలకు అందిస్తాం**
- **మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

ప్రజానావ, సిద్దిపేట: కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేసిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు సొంత ఇళ్లు నిర్మించి ఇవ్వడంలో మాత్రం విఫలమైందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించింది, ప్రారంభించింది, చివరకు దెబ్బతినే పరిస్థితికి తీసుకెళ్లింది కూడా బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఆయన ఆరోపించారు. అలాంటి వారు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమేనన్నారు. సిద్దిపేట జిల్లా ములుగు మండలంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇంటి పట్టాలు పంపిణీ చేసిన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, జిల్లా కలెక్టర్ హైమావతి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ అసెంబ్లీకి రావాలి

కాళేశ్వరం ప్రాజెక్టుపై జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ) తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ బీఆర్ఎస్ నాయకులు వాస్తవాలను విస్మరించి మాట్లాడుతున్నారని మంత్రి విమర్శించారు. ప్రాజెక్టు నిర్మాణంలో చిత్తశుద్ధి, నాణ్యతకు ప్రాధాన్యం ఇచ్చి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. ఒకప్పుడు కాళేశ్వరాన్ని ప్రపంచంలో ఎనిమిదో వింతగా అభివర్ణించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి ప్రాజెక్టు నిర్మాణంపై ప్రజలకు సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, వాస్తవాలను సభా వేదికగా వెల్లడించాలని కోరారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాన్ని మధ్యలోనే నిలిపివేసిందని పొంగులేటి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం గుడిసెలులేని తెలంగాణ లక్ష్యంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లన్నింటినీ మరమ్మతులు పూర్తి చేసి త్వరలోనే లబ్ధిదారులకు అందజేస్తామని హామీ ఇచ్చారు. అవసరమైతే ఎంతటి ఆర్థిక భారం వచ్చినా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంత ఇంటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

రెండో విడతలో 2.5 లక్షల ఇళ్లు

రాష్ట్రంలో ఇంకా సుమారు 32 వేల పూరిగుడిసెలు ఉన్నాయని మంత్రి తెలిపారు. తొలి విడతలో అవకాశం రాని అర్హులకు రెండో విడత ఇందిరమ్మ ఇళ్లలో ప్రాధాన్యం కల్పిస్తామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే రెండున్నర లక్షల ఇళ్లను రెండో విడతలో మంజూరు చేశామని వెల్లడించారు. గతంలో అసంపూర్తిగా నిలిచిపోయిన ఇళ్లను పూర్తి చేసేందుకు నిధులు విడుదల చేయాలని మంత్రివర్గం నిర్ణయించిందని, ప్రతి నియోజకవర్గంలో కనీసం 500 అసంపూర్తి ఇళ్లను పూర్తి చేసేందుకు నిధులు కేటాయిస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో రాజకీయాలకు, పైరవీలకు తావులేదని మంత్రి స్పష్టం చేశారు. అర్హతే ప్రామాణికంగా ప్రతి పేద కుటుంబానికి ఇల్లు మంజూరు చేస్తున్నామని చెప్పారు. గతంలో కొన్ని నియోజకవర్గాలకే పరిమితమైన గృహ నిర్మాణ పథకాలకు భిన్నంగా, ఈ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు సమాన ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు.

టూరిజంపై ఫోకస్

(మొదటిపేజీ తరువాయి)

పేర్కొన్నారు. అర్బన్ ఫారెస్ట్ ప్రా జెక్టుల అమలుకు ప్రత్యేక అధికారులను నియమించా లని ఆదేశించారు.

హెరిటేజ్ ప్రాంతాలకు కొత్త రూపు

పురానాపూల్‌తో పాటు ఇతర వారసత్వ వంతెనలను పర్యాటక ఆకర్షణలుగా తీర్చిదిద్దాలని సీఎం సూచించారు. అవసరమైతే ట్రాఫిక్‌ను మళ్లించి, పర్యాటకులు సందర్శించేందుకు అనువైన సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. అలాగే డిసెంబర్‌లో నిర్వహించనున్న గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌కు ఇప్పటి నుంచే సన్నాహాలు ప్రారంభించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర పర్యాటక రంగంలో పెట్టుబడులను ఆకర్షించేలా కార్యాచరణ రూపొందించి, తెలంగాణను ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దాలని సూచించారు.

భగీరథ్ బెయిల్‌పై తీర్పు రిజర్వ్

- **దర్యాప్తు పూర్తయ్యే వరకూ బెయిల్ ఇవ్వొద్దని బాధితురాలి తరపున విజ్ఞప్తి**

ప్రజానావ, హైదరాబాద్: పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న బండి భగీరథ్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో ఇరుపక్షాల వాదనలు ముగిశాయి. వాదనలు పూర్తికావడంతో బెయిల్‌పై తీర్పును కోర్టు రిజర్వ్ చేసింది. భగీరథ్‌కు బెయిల్ మంజూరు చేస్తే దర్యాప్తుపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని ప్రభుత్వం తరపు న్యాయవాది కోర్టుకు వివరించారు. సాక్షులను ప్రభావితం చేసే అవకాశముండటంతో పాటు విచారణకు ఆటంకం కలగవచ్చని బషీర్‌బాగ్ పోలీసులు దాఖలు చేసిన కౌంటర్‌లో పేర్కొన్నారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసి, బాధితురాలి వాంగ్మూలం ఆధారంగా ఆరోపణల తీవ్రత దృష్ట్యా అభియోగాలను సవరించినట్లు తెలిపారు. బాధితురాలి వాంగ్మూలం ప్రకారం నిందితుడు స్నేహం పేరుతో పరిచయం పెంచుకుని పలుమార్లు లైంగిక దాడికి పాల్పడినట్లు ప్రభుత్వం తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. నిందితుడి తండ్రి కేంద్ర మంత్రి కావడంతో కేసు విచారణపై ప్రభావం చూపే అవకాశం ఉందని బాధితురాలి తరపు న్యాయవాది వాదించారు. దర్యాప్తు ఇంకా కొనసాగుతున్నందున ఈ దశలో బెయిల్ ఇవ్వకూడదని కోరారు.

జైల్లో ఉంటేనే పారదర్శక విచారణ

కేసులో కీలక సాక్షుల విచారణ ఇంకా మిగిలి ఉందని, నిందితుడు బెయిల్‌పై విడుదలైతే సాక్షులు వాంగ్మూలాలు ఇవ్వడానికి వెనుకాడే అవకాశం ఉందని బాధితురాలి తరపు న్యాయవాది పేర్కొన్నారు. భగీరథ్ జైల్లో ఉన్నప్పుడే కేసు విచారణ పారదర్శకంగా సాగుతుందని కోర్టుకు వివరించారు. ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు బెయిల్ పిటిషన్‌పై తీర్పును రిజర్వ్ చేసింది.

నేటితో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తికావాలి

(మొదటిపేజీ తరువాయి)

చేయాలని అధికారులకు సూచించారు.

సూపర్‌వైజర్లకు కీలక బాధ్యతలు

ఎన్యూమరేషన్ ఫారాల భర్తీలో సూపర్‌వైజర్లు కీలక పాత్ర పోషించాలని సీఈఓ పేర్కొన్నారు. పనితీరు బలహీనంగా ఉన్న బీఎల్వోలను గుర్తించి వారికి అవసరమైన సహకారం అందించాలని ఆదేశించారు. అవసరమైతే స్థానిక వాలంటీర్లను వినియోగించి ఓటర్లకు ఫారాల భర్తీలో సహాయం అందించాలని సూచించారు. సంబంధిత సూపర్‌వైజర్ల ఫోన్ నంబర్లను ప్రజలకు విస్తృతంగా అందుబాటులో ఉంచాలని చెప్పారు. హైదరాబాద్‌లో ఇప్పటికే ఏర్పాటు చేసిన 16 హెల్ప్‌డెస్క్‌లతో పాటు అవసరమైన ప్రాంతాల్లో మరిన్ని హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. పూర్తి చేసిన ప్రతి ఎన్యూమరేషన్ ఫారంపై ఓటరు, బీఎల్వో సంతకాలు, ఫొటోలు తప్పనిసరిగా ఉండేలా చూడాలని స్పష్టం చేశారు. అలాగే పూర్తి అయిన ఫారాల డిజిటలైజేషన్‌ను వెంటనే ప్రారంభించాలని సూచించారు.

క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ

ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు విస్తృతంగా క్షేత్రస్థాయిలో పర్యటించి ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలని సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. ఒకే కుటుంబానికి చెందిన ఓటర్ల పేర్లు వీలైనంత వరకు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ చేపట్టాలని సూచించారు. ఆన్‌లైన్‌లో వచ్చిన ఎన్యూమరేషన్ ఫారాలను కూడా బీఎల్ఓలు క్షుణ్ణంగా పరిశీలించాలని చెప్పారు. బీఎల్వోలు, సూపర్‌వైజర్లకు మరోసారి శిక్షణ ఇవ్వాలని, రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహిస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియపై వారికి పూర్తి అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ ఎన్నికల అధికారి చారి, డిప్యూటీ కలెక్టర్ చెన్నయ్య, చిరంజీవి తదితర అధికారులు పాల్గొన్నారు.

కష్టంగా ఖరీఫ్!

- **ఈసారి ఆశించిన మేర కురవని వానలు**
- **గతేడాదితో పోలిస్తే 21శాతం తగ్గిన సాగు విస్తీర్ణం**
- **దేశవ్యాప్తంగా 350.85 లక్షల హెక్టార్లకే పరిమితం**
- **వరి సహా పప్పు, నూనెగింజలు, ముతక ధాన్యాలు, పత్తిపైనా ప్రభావం**

న్యూఢిల్లీ: నైరుతి రుతుపవనాల ఆలస్యం, ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడం దేశంలోని ఖరీఫ్ సాగుపై తీవ్ర ప్రభావం చూపుతోంది. వర్షాభావంతో రైతులు విత్తనాలు వేయడాన్ని వాయిదా వేయడం లేదా నిలిపివేయడంతో ఈసారి ఖరీఫ్ సాగు గణనీయంగా తగ్గింది. జులై 6 నాటికి దేశవ్యాప్తంగా ఖరీఫ్ పంటలు 350.85 లక్షల హెక్టార్లలో మాత్రమే సాగయ్యాయని కేంద్ర వ్యవసాయ శాఖ వెల్లడించింది. గత ఏడాది ఇదే సమయానికి నమోదైన 442.80 లక్షల హెక్టార్లతో పోలిస్తే ఈసారి సాగు విస్తీర్ణం 21 శాతం మేర క్షీణించింది. నైరుతి పురోగతి మందగించడం వల్ల అనేక రాష్ట్రాల్లో వ్యవసాయ కార్యకలాపాలు ఆశించిన వేగంతో ముందుకు సాగడం లేదని అధికారులు పేర్కొన్నారు. దేశంలో ప్రధాన ఖరీఫ్ పంట అయిన వరి సాగుపైనా వర్షాభావం తీవ్ర ప్రభావం చూపింది. గత ఏడాది జూలై 6 నాటికి 69.30 లక్షల హెక్టార్లలో వరి సాగు నమోదవగా, ఈసారి అది 60.24 లక్షల హెక్టార్లకు పరిమితమైంది. దీంతో వరి సాగు విస్తీర్ణంలో 13 శాతం తగ్గుదల నమోదైంది. పప్పుధాన్యాల సాగు గత ఏడాది 47.49 లక్షల హెక్టార్ల నుంచి ఈసారి 37.15 లక్షల హెక్టార్లకు తగ్గింది. ముతక ధాన్యాలు (శ్రీ అన్న) సాగు కూడా 71.86 లక్షల హెక్టార్ల నుంచి 60.12 లక్షల హెక్టార్లకు క్షీణించింది. నూనెగింజల సాగులో అత్యధిక తగ్గుదల నమోదైంది. గత ఏడాది 109.27 లక్షల హెక్టార్లలో సాగు జరగగా, ఈసారి అది 66.31 లక్షల హెక్టార్లకే పరిమితమైంది. ఇక పత్తి సాగు విస్తీర్ణం కూడా గత ఏడాది నమోదైన 82 లక్షల హెక్టార్ల నుంచి ఈసారి 63.18 లక్షల హెక్టార్లకు పడిపోయింది. దేశంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు ఆలస్యంగా ప్రారంభం కావడం, సాధారణం కంటే తక్కువగా నమోదవడం వల్ల రైతులు విత్తనాలు వేసేందుకు వెనుకంజ వేస్తున్నారని వ్యవసాయ శాఖ తెలిపింది. రానున్న రోజుల్లో నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదిలి విస్తృతంగా వర్షాలు కురిస్తే ఖరీఫ్ సాగు కొంత పుంజుకునే అవకాశముందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రెండేళ్లలో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పూర్తి

(మొదటిపేజీ తరువాయి)

సాంకేతిక పరిజ్ఞానంతో టన్నెల్ పనులు పునఃప్రారంభించిన తర్వాత ఇప్పటికే అర కిలోమీటర్‌కు పైగా తవ్వకం పూర్తయిందని మంత్రి వెల్లడించారు. దేవరకొండ వైపు నుంచి పనులు సంతృప్తికరంగా సాగుతున్నాయని, శ్రీశైలం వైపున కూడా అన్ని భద్రతా ప్రమాణాలను పాటిస్తూ నిర్మాణం కొనసాగుతోందన్నారు. టన్నెల్ పనుల వేగాన్ని మరింత పెంచేందుకు మూడు అత్యాధునిక ఆర్మీ బూమర్ యంత్రాలు ముంబై పోర్టుకు చేరాయని, ఈ నెలాఖరులో పనుల ప్రదేశానికి చేరుకోనున్నాయని చెప్పారు.

సాగు, తాగునీటికి భరోసా

ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు ద్వారా శ్రీశైలం జలాశయం నుంచి 40 టీఎంసీల నీటిని తరలించి 4.01 లక్షల ఎకరాలకు సాగునీరు అందించనున్నట్లు మంత్రి తెలిపారు. అలాగే ఫ్లోరైడ్ ప్రభావిత 618 గ్రామాలకు సురక్షిత తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు నీటి సరఫరా కూడా ఈ ప్రాజెక్టు ద్వారా సాధ్యమవుతుందని చెప్పారు. ప్రాజెక్టు సవరించిన పరిపాలనా వ్యయం సుమారు రూ.12,718 కోట్లుగా ఉందని వెల్లడించారు. పనుల వేగం ఎంత ముఖ్యమైనదైనా, కార్మికుల ప్రాణ భద్రత అంతకంటే ముఖ్యమని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. టన్నెల్‌లో తగిన వెలుతురు



ఆర్టికల్ 370 రద్దు కోసం ఉద్యమించిన మహానేత శ్యాంప్రసాద్ ముఖర్జీ

- **బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి**

ప్రజానావ, సిరిసిల్ల : ఆర్టికల్ 370ని రద్దు చేసి జమ్మూకశ్మీర్‌ను దేశంలో సమైక్య భాగంగా గుర్తించాలంటూ ఉద్యమించిన మహానేత డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీఅని అన్నారు. భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏక్ దేశ్ మే దో నిశాన్, దో ప్రధాన్, దో విధాన్ నహీ చెలేగా.. నహీ చెలేగా.. అనే నినాదం వినగానే మన కళ్ల ముందు కదులుతారు దేశ సమైక్యత కోసం ప్రాణాలర్పించిన మహా నేత డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు మున్సిపల్ కౌన్సిలర్ ఎర్రం వెంకటరాజం, పట్టణ ప్రధాన కార్యదర్శులు మున్సిపల్ కౌన్సిలర్లు కొండ నరేష్, మెరుగు శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్లు ఉరవగొండ రాజు, మామిడాల మహేష్, సిరిసిల్ల పట్టణ ఉపాధ్యక్షులు మోర శ్రీహరి, సిరిసిల్ల పట్టణ అధికార ప్రతినిధి మోర రవి, పట్టణ కార్యదర్శి సూరం వినయ్, దూడం సురేష్, గాలి శ్రీనివాస్, కనుకయ్య, సిద్ది దేవరాజు, గొట్టే భాను, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



పేదల సంక్షేమమే ప్రభుత్వ బాధ్యత

- **రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ చిన్నారెడ్డి**

ప్రజానావ, ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో: పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ముఖ్య బాధ్యతని తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. సోమవారం వనపర్తి జిల్లా కేంద్రంలో 110 మంది లబ్ధిదారులకు రూ. 38,84,200 విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ.. కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్య ఖర్చులతో ఇబ్బంది పడుతున్న పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఎంతో భరోసానిస్తోందన్నారు. సంక్షేమం, అభివృద్ధిని సమానంగా ముందుకు తీసుకెళ్తూ.. ప్రతి పేద కుటుంబం సంతోషంగా ఉండే తెలంగాణ నిర్మాణానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నందిమల్ల యాదయ్య, రాజేంద్రప్రసాద్ యాదవ్, కోళ్ల వెంకటేష్, దేవన్న యాదవ్, చంద్రశేఖర్, సహదేవుడు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గుడిసె వాసులకు పట్టాలు ఇవ్వాలి

- **మౌలిక సదుపాయాలు కల్పించాలి**
- **సీపీఎం పార్టీ నాయకులు డిమాండ్**

మంచిర్యాల జిల్లా / చెన్నూర్ (ప్రజానావ ప్రతినిధి) : చెన్నూరు మండలం బావురావుపేట శివారు సర్వేనెంబర్ 8లో నివాసం ఉంటున్న పేద ప్రజలకు పట్టాలు ఇవ్వాలని ఎమ్మార్వో ఆఫీస్ ముందు ధర్నా చేసి డిటి కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా బోడంకి చందు సిపిఎం జిల్లా కార్యదర్శి హాజరై మాట్లాడుతూ.. బావురావుపేట శివారు సర్వేనెంబర్ 8లో పేద ప్రజలు నాలుగు సంవత్సరాలుగా రాత్రానిక, పగలనకా చీకట్లో కూడా కనీస సౌకర్యాలు లేకున్నా అక్కడే నిరుపేదలు ఇంటి స్థలం కోసం నివసిస్తున్నారని, వారికి కనీస సౌకర్యాలు లైన మంచినీల్లు, కరెంటు, రోడ్డు, ఇందిరమ్మ ఇల్లు, ఇంటి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉమారాణి సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు, సిపిఎం నాయకులు, కృష్ణమాచారి, ఎర్మా పున్నం, గుడిసె వాసులు, సమ్మక్క, బండారి రాజేశ్వరి, తుమ్మ రేణుక, భోగే సత్యం, యామిని, రాసకట్ల పోచం, ఎల్లక్క, శ్యామల, బండారు శ్రీనివాస్, కామెర్ మధుకర్, సరిత, మధు నక్క, మహేశ్వరి, సత్యక్క, మల్లికార్జున్, ఈ కార్యక్రమానికి మద్దతుగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎర్రోళ్ల సంజయ్, నాయకులు ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి, మరొకరికి గాయాలు

ప్రజానావ, ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో: వనపర్తి జిల్లా అడ్డాకుల మండల కేంద్రంలోని టోల్ ప్లాజా సమీపంలో సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం పాలవగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. కాటవరం గ్రామానికి చెందిన ఎరుకలి బాలయ్య (35) మరో వ్యక్తితో కలిసి టీవీఎస్ ఎక్సెల్‌పై వెళ్తుండగా, పరకాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వారిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎరుకలి బాబు ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన మరో వ్యక్తిని 108 అంబులెన్స్‌లో జిల్లా ఆసుపత్రికి తరలించారు. మృతుడు టోల్ ప్లాజా వద్ద చిన్న హోటల్ నడుపుతూ కుటుంబాన్ని పోషించేవాడని, ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారని అడ్డాకుల ఎస్ఐ మురళి తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఈఎస్ఐ ఆస్పత్రి త్వరితగతిన నిర్మించాలి

- **కలెక్టర్‌ను కోరిన ఐదక్యవేదిక ప్రతినిధులు**

ప్రజానావ, కరీంనగర్ : రామగుండం నియోజకవర్గానికి మంజూరైన ఈఎస్ఐ ఆస్పత్రి త్వరితగతిన నిర్మించాలని స్వచ్ఛంద సంఘాల ఐక్య వేదిక ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. వేదిక ప్రతినిధులు వ్దదెల దినేష్, గోలివాడ చంద్రకళ, దుర్గం నగేష్ మాట్లాడుతూ ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యం వల్ల ఆస్పత్రి స్థల సేకరణ, నిర్మాణంలో జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు. దీంతో అసంఘటిత కార్మికులు వైద్య సేవలకు నోచుకోవడం లేదని మండిపడ్డారు. వంద పడకల ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణం కోసం ంద్ర ప్రభుత్వం రూ.వంద కోట్లు నిధులు మంజూరు చేసినా జిల్లా అధికారుల నిర్లక్ష్యంతో అడుగు ముందుకు పడటం లేదన్నారు. పారిశ్రామిక ప్రాంత ప్రగతికి కార్మికుల ఆరోగ్య భద్రత అత్యంత కీలకమనీ, ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణం జరిగితే వేలాది మంది కార్మికులు, వారి కుటుంబా లకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. తక్షణమే రామగుండంలో వంద పడకల ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణానికి పునాది వేయాలని కలెక్టర్‌ను కోరారు.



భీమేశ్వర క్షేత్రంలో భక్తజన సంద్రం

- **వేములవాడలో పోటెత్తిన భక్తులు**
- **అభిషేకాలు, అర్జిత సేవల్లో విశేషంగా పాల్గొన్న భక్తులు**

ప్రజానావ, రాజన్న సిరిసిల్ల: రాష్ట్రంలోని ప్రముఖ సేవా క్షేత్రంగా పేరుగాంచిన వేములవాడ పట్టణం సోమవారం భక్తజన సందోహంతో కిటకిటలాడింది. ఆదిదేవుడు శ్రీ రాజరాజేశ్వర స్వామివారి అనుబంధ ఆలయమైన భీమేశ్వర క్షేత్రంలో భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని పుణ్యఫలాలను పొందారు. ఈ సందర్భంగా భక్తులు గర్భగుడిలో అభిషేకం, అన్నపూజ తదితర ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అలాగే శ్రీ స్వామివారి నిత్యకళ్యాణం, కోడెమొక్కు చెల్లింపు, అమ్మవారి కుంకుమ పూజ తదితర అర్జిత సేవలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. మరో అనుబంధ ఆలయమైన బద్ది పోచమ్మ అమ్మవారి ఆలయంలో కూడా భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని బోనం మొక్కులు సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో రమాదేవి నేతృత్వంలో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేసి పర్యవేక్షించారు.

గురుకులాల్లో నాణ్యమైన భోజనం కరువు

- **ఎమ్మెల్యే కోవ లక్ష్మి విమర్శలు**

ప్రజానావ, ఆసిఫాబాద్ : సీఆర్ ప్రారంభించిన గురుకులాల్లో గిరిజన విద్యార్థులకు నాణ్యమైన అందించారని ఆసిఫాబాద్ శాసన సభ్యురాలు కోవ లక్ష్మి అన్నారు. వాటిని ఇప్పుడు అధ్వాన్నంగా మార్చారని అన్నారు. నాణ్యమైన భోజనం డా పెట్టడం లేదన్నారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం బుసిమెట్టలోని గిరిజన గురుకుల జూనియర్ కళాశాలలో కంపౌండ్ వాల్ నిర్మాణానికి భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన బిడ్డల చదువుకు , భద్రతకు నాటి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. కంపౌండ్ వాల్ నిర్మాణం పనులు పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జైనూర్ మండల మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమేత విశ్వనాథ్, ఫాక్స్ చైర్మన్ కొడప హన్ను పటేల్, జైనూర్ సర్పంచ్ కొడప ప్రకాష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఇంతియాజుఅలాల, అధికారులు తదితరులు పాల్గొన్నారు.




మానేరు నుంచి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

ప్రజానావ, జమ్మికుంట : మానేరు నుంచి జరుగుతున్న అక్రమ ఇసుక రవాణాను అరికట్టి, సామాన్యులకు ఇసుకను అందుబాటు ధరలో సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ భాజపా జమ్మికుంట పట్టణ శాఖ ఆధ్వర్యంలో సోమవారం గాంధీ చౌక్ లో నిరసన దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భాజపా జమ్మికుంట పట్టణ అధ్యక్షుడు కె. రాజు మాట్లాడుతూ, ఇళ్ల నిర్మాణం చేపడుతున్న సామా న్యులు ఇసుక కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు తీసుకోవడం తో పాటు, సామాన్యులకు తక్కువ ధరకు ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతి రేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కె. రాజు, ఎ. రాజేందర్, బి. శివకుమార్, టి. రాజ్‌కుమార్, ఎస్. శ్రీనివాస్, వై. సమ్మయ్య, కె. నగేష్ తదితర భాజపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీర్కూరు గురుకులంలో ఫుడ్ పాయిజనింగ్

- **భోజనం వికటించి 17మంది విద్యార్థులకు అస్వస్థత**

ప్రజానావ, నిజామాబాద్ : బీర్కూరు మండల ంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాల, కళాశాలలో ఆదివారం రాత్రి భోజనం వికటించి 17 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వీరిని వెంటనే 108 అంబులెన్స్ లో బాన్సువాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రాత్రి 12 మంది విద్యార్థులను ఆసుపత్రిలో అడ్మిట్ చేశారు. కాగా సోమవారం మరో ఐదుగురి విద్యార్థులను బాన్సువాడ ఆసుపత్రికి తరలించారు. 15 మంది విద్యార్థుల పరిస్థితి నిలకడగా ఉందని వారిని డిశ్చార్జ్ చేసినట్లు, మరో ఇద్దరు విద్యార్థులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు బీర్కూర్ మండల వైద్యాధికారిని శ్రీలేఖ తెలిపారు. ఆదివారం రాత్రి 9 గంటలకు భోజనం చేయగా కొంతమంది విద్యార్థులకు వాంతులు, విరోచనాలు మొదలయ్యాయని అన్నారు.



ఖైరతాబాద్ నియోజకవర్గం జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్ డివిజన్‌లోని భగత్ సింగ్ కాలనీలో సోమవారం ఎస్ఐఆర్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన వెంట 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగ్ రావు, డివిజన్ అధ్యక్షుడు కాటూరి రమేశ్, గుంటి నగేశ్ సాగర్, ఆకుల రాజు, అబ్దుల్ గని, సహదేవ్, నడిమింటి కృష్ణ, గౌస్, సంపంగి కిరణ్, పద్మ, దానమ్మ, మల్లేశ్వరమ్మ, చంద్రమ్మ పాల్గొన్నారు.

– ప్రజానావ, ఖైరతాబాద్

కాళేశ్వరంను కూలేశ్వరం చేసింది ఎవరు?

- **లక్ష కోట్లు పెట్టి ప్రజల సొమ్ము దుబారా చేశారు**
- **కాళేశ్వరంపై కేటీఆర్ డ్రామాలు కట్టిపెడితే మంచిది**
- **బీఆర్ఎస్ తీరుపై మండిపడ్డ మంత్రి సీతక్క**

ప్రజానావ, మహబూబాబాద్ : కాళేశ్వరం పేరుతో కెటిఆర్ డ్రామాలు చేస్తున్నారని మంత్రి సీతక్క ఎద్దేవా చేశారు. మాజీ మంత్రి టీఆర్ తీరుపై పై మంత్రి సీతక్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మహబూబాబాద్‌లో పర్యటించి, పలు కార్యక్రమాల్లో మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె పూడియాతో మాట్లాడారు. టీఆర్‌కు అధికార దాహమే తప్ప... ప్రజలపై ప్రేమ లేదని విమర్శించారు. పదేళ్లు అధికారంలో ఉండి ఏం చేశారని మంత్రి ప్రశ్నించారు. కాళేశ్వరం కట్టింది.. లిపోయింది బీఆర్ఎస్ హయాంలోనే అని ప్రస్తావించారు. కాళేశ్వరం పేరుతో లక్షన్నర కోట్లను వృథా చేశారని ఆరోపించారు. మళ్లీ అధికారం కావాలంటున్నారని.. ఆ ప్రాజెక్టులో నీటిని నిల్వచేస్తే పరివాహక గ్రామాలన్నీ కొట్టుకుపోవాలని టీఆర్ చూస్తున్నారా.. అని మంత్రి సీతక్క ప్రశ్నించారు. పదేళ్లలో తెలంగాణ ప్రజల జీవితాలను బీఆర్ఎస్ తాకట్టు పెట్టిందని మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లలో నీటి పారుదల శాఖను నాశనం చేశారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ నాయకులు ఏది ముట్టుకుంటే అది నాశనమని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చాక ఇరిగేషన్ శాఖను చక్కదిద్దామని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ నాయకుల లాభం కోసం కాళేశ్వరం కట్టారు తప్ప.. తెలంగాణ ప్రజల కోసం కాదని చెప్పుకొచ్చారు. కోట్లు ఖర్చు చేసి నామమాత్రపు ఆయకట్టు ఇచ్చారని మంత్రి తెలిపారు. ఆ ప్రాజెక్టులు అన్ని అసంపూర్తిగా ఉన్నాయని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టింది సీఆర్ హయాంలోనే.. లిపోయింది వాళ్ల హయాంలోనే అని



ఇంజినీర్లు రిపోర్ట్ ఇచ్చారని ప్రస్తావించారు. కన్నెపల్లి పంపు దగ్గరకు పోయి ప్రాణహిత పంపు ఆన్ చేసి నీళ్లు ఇవ్వాలంటూ మాజీ మంత్రి టీఆర్ నాటకాలు ఆడుతున్నారని వ్యంగ్యంగా అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు సరిగ్గా కడితే ఈ పరిస్థితి వచ్చేది కాదని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ వల్లే కాళేశ్వరం నీళ్లు ఉపయోగించలేక పోతున్నామని అన్నారు. నాసిరక నిర్మాణం వల్లే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులు ఉపయోగించలేక పోతున్నామని మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఫౌండేషన్ తప్పుగా ఉందని అధికారులు రిపోర్ట్ ఇచ్చారని తెలిపారు. కాళేశ్వరం ఇలానే కొనసాగిస్తే ప్రమాదమని అంతర్జాతీయ, జాతీయ నీటి నిపుణులు నివేదిక ఇచ్చారని అన్నారు. టీఆర్ కన్నా ఎన్డీఎస్ఏ అధికారులకు నాలెడ్జ్ ఎక్కువగా ఉందని తాను అనుకుంటున్నానని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టులో నీళ్ల స్టోరేజ్ చేసినప్పుడు లిపోతే కింద ఉన్న 40 ఊర్లు, భద్రాచలం కొట్టుకుపోతుందని హెచ్చరించారు. బీఆర్ఎస్ నాయకులు కవూషన్లకు కక్కుర్తి పడి తుమ్మడిహెట్టి వద్ద ప్రాజెక్ట్ కట్టకుండా తెలంగాణ ప్రజలకు తీవ్ర అన్యాయం చేశారని ధ్వజమెత్తారు. లేకపోతే ఎప్పుడో ఉత్తర తెలంగాణ సస్యశామలం అయ్యేదని వివరించారు. తెలంగాణ ప్రజలకు అన్యాయం చేసింది కాక ఇప్పుడు ఎదురుదాడి విమర్శలు చేయడంపై మంత్రుఇ సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు.

ముఖర్జీ సేవలు నిరుపమానం

- **దలైలామాతో అనుబంధం గుర్తు చేసుకున్న కిషన్‌రెడ్డి**
- **హైడ్రా తీరుపై మరోమారు ఆగ్రహం**

ప్రజానావ, హైదరాబాద్ : శ్యామప్రసాద్ జయంతి, దలైలామా జన్మదినం సందర్భంగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఘనంగా నివాళి అర్పించారు. ముఖర్జీ సేవలను ఆయన కొనియాడారు. అలాగే దలైలామా ఆయు రారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. దలైలామాతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ .. హైదరాబాద్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి సర్కారుకు మజ్లిస్ పార్టీ అంటే భయమా, ప్రేమా లేక రెండూ ఉన్నాయా అని ఆయన ప్రశ్నించారు. భూములు, రియల్ ఎస్టేట్ వ్యవహారాల్లో కవూషన్ల కోసం ఆరాటపడు తున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం.. ఇందుకోసం సామాన్య ప్రజల జీవనోపాధిని బలిచేస్తోందని ఆరోపించారు. అదే సమయంలో మజ్లిస్ పార్టీ అగ్రనేతల ప్రయోజనాలను కాపాడేందుకు ఈ ప్రభుత్వం ఎంత దూరమైనా వెళ్లేందుకు వెనుకాడటం లేదని మండిపడ్డారు. రేవంత్ సర్కార్ సాగిస్తున్న పక్షపాత పాలనకు హైడ్రా చర్యలే ప్రత్యక్ష ఉదాహరణ అని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. సామాన్య ప్రజల ఇళ్లు, నిర్మాణాల విషయంలో మాత్రం మెరుపు వేగంతో నిర్ణయాలు తీసుకుంటూ, కరినంగా బుల్డోజర్లతో వ్యవహరిస్తున్న ప్రభుత్వం.. ఒవైసీ కుటుంబానికి చెందిన బారిష్టర్ ఫాతిమా ఓవైసీ ఎడ్యుషనల్ క్యాంపస్ విషయంలో మాత్రం వూనమేషాలు లెక్కిస్తోందని దుయ్యబట్టారు. సల్కం చెరువు ఫుల్ ట్యాంక్ లెవల్, బఫర్ జోన్‌ను ఆక్రమించి ఈ క్యాంపస్ నిర్మించారనే ఆరోపణలపై తెలంగాణ హైకోర్టు పలుమార్లు జోక్యం చేసుకుని, ప్రభుత్వ జాప్యంపై చీవాట్లు పెట్టినా సర్కారు తీరు మారలేదన్నారు. ప్రజలందరికీ 'ఒ చట్టం, ఒ న్యాయం' అనే సూత్రాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.





భారత ఉప ప్రధాని డా.బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా సోమవారం జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లో ఏర్పాటు చేసిన ఆయన విగ్రహానికి ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు కాటూరి రమేశ్, ఏ. లక్ష్మీ నారాయణ, చెవుల విజయ రావు, కనతల బాలస్వామి, నడిమిటి కృష్ణ మారేడు ప్రసాద్, ఎండీ గౌస్, నరసింహ, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

– ప్రజానావ, ఖైరతాబాద్

అయోధ్య విరాళాల దోపిడీ వ్యవహారం

- **దేశానికి బీజేపీ క్షమాపణలు చెప్పాలన్న పొన్నం**

ప్రజానావ, సిద్దిపేట : అయోధ్య విరాళాల చోరీపై బిజెపి దేశానికి క్షమాపణలు చెప్పాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. జేపీ నాయకులు.. రాముని పేరుతో, అక్షింతలపై విరాళాలు అడుక్కున్నారని విమర్శించారు. బీజేపీ నాయకుల అవినీతిని గుర్తించి అయోధ్య ప్రజలే ఆ పార్టీ ఎంపీని ఓడించారన్నారు. ఈ విషయంలో బీజేపీ స్పందించి.. దేశ ప్రజలందరికీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. శ్రీరామునికి రామ జన్మభూమిలో రామ మందిర విరాళారం నిర్మాణానికి ప్రజలు ఎవరి స్థితికి తగ్గట్టు వారు విరాళాలు ఇచ్చారని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సోమవారం పూడియాతో మాట్లాడుతూ.. విరాళాల్లో కోట్ల రూపాయలు అవినీతి జరిగిందని ఆరోపించారు. రాజకీయంగా ఎదగడానికి రాముని పేరును కమలం పార్టీ వాడుకుందని ఆరోపించారు. రాజకీయం వేరు, భక్తి వేరని మంత్రి తెలిపారు. ఈ విషయంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, అమిత్ షా, యూపీ ముఖ్యమంత్రిదే బాధ్యత అని అన్నారు. రాముడి హుండీలోని విరాళాలను ఎత్తుకెళ్లడం దేశ ప్రజలకు అవమానకరమన్నారు. భక్తి పేరుతో, రాముని పేరుతో రాజకీయం చేసే వారి రంగును ప్రజలు గుర్తించాలని తెలిపారు. దేవుడి పేరుపై బీజేపీ స్కాం చేసిందని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. అయోధ్యలో రామ జన్మభూమి నిర్మాణం జరగాలనీ శిలాన్యాసం రాజీవ్ గాంధీ గారు వేశారు..అయోధ్య ట్రస్ట్ నిర్వాహకులు ప్రధాని మోదీ, అమిత్ షా,ముఖ్యమంత్రి గారికి సన్నిహితులు వారు ఎందుకు స్పందించడం లేదన్నారు. హుండీలు కొల్లగొట్టారు.. రాముని పేరు వూద దేశ వ్యాప్తంగా వసూలు చేసిన చందాలు ఎత్తుకొని పోయారు.. ఇక్కడ ప్రతి ఊర్లో అక్షింతలు పంచి ఓట్లు అడిగారు.. రామాలయం పై బీజేపీ పెద్దలు స్పందించాలి...భక్తి పేరు వూద రాముని పేరు వూద రాజకీయాలు చేసే వారు మాట్లాడాలని పొన్నం అన్నారు. అక్కడ జరిగిన దానిపై పొరపాటు అని దేశ ప్రజలకు క్షమాపణలు అడగాలి.. రాష్ట్రంలో ఓటరు సవరణ పక్రియ జరుగుతుంది. ఓటరు సవరణ ప్రజాస్వామ్యంలో చాలా ముఖ్యమైంది..ప్రతి ఇంటింటా ఎన్యూమరేషన్ ఫారాలు చేరాయి.. బిఎల్‌వోలతో సమన్వయం చేసుకుంటూ అర్హత కలిగిన ఒక ఓటు డా మిస్ కాకుండా చూడాలన్నారు. నేను స్వయంగా ఏడు మండలాలు ప్రత్యక్షంగా తిరిగాను..మా పార్టీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చాం..హైదరాబాద్ ,సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో బతిన పై ఉప ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో జరిగింది..ఓటరు సవరణ పక్రియ విజయవంతంగా జరగాలని అన్నారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
విలేకరులు కావలెను
రెండు తెలుగు రాష్ట్రాల్లో వేగంగా విస్తరిస్తున్న తెలుగు దినపత్రిక ప్రజానావలో పని చేయుటకు మా సంస్థ ఆహ్వానం పలుకుతోంది
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాల్లో పనిచేయుటకు విలేకరులు కావలెను.
మండలాలు, అర్బన్, పట్టణ కేంద్రాల్లో పనిచేసే వారికి కనీస అర్హత ఇంటర్మీడియట్
స్టాఫ్ రిపోర్టర్, ఆర్‌సీ ఇన్‌చార్జిలకు కనీస అర్హత డిగ్రీ ఉండాలి
మీ బయోడేటాను ఇప్పుడే ఈ నెంబర్లకు వాట్సాప్ చేయండి
9948433277, 9014966169



హోటళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలి

ఎంతో నమ్మకంతో హోటల్‌కు వెళ్లిన వారికి ఇలాంటి తిండి పెడుతూ కోట్లు వెనుకుంటున్న హోటళ్లను మూసేయాల్సిందే. వారిని వెనక ఉండి నడిపిస్తున్న రాజకీయ నాయకుల భరతం పట్టాల్సిందే. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వారిని అస్సలు వదలడదు. ఎందుకంటే వీరి వండివారుస్తున్న తిండి వల్ల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. కొత్త కొత్త జబ్బులు కొని తెచ్చుకుంటున్నారు. ఇవన్నీ గుర్తించి ఇలాంటి హోటల్ వాళ్లపై కఠిన చర్యలు తీసుకుంటే తప్ప హైదరాబాద్ పరువు కాపాడుకోలేం. ఇటీవల నగరంలో వరుసగా ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడులు చేసి వండల సులు నమోదు చేశారు. ప్రఖ్యాత హోటళ్లలోనే కంపు కొట్టేలా కిచెన్‌లు ఉంటున్నాయి.

EDITORIAL

కుళ్లిన ఆహార పదార్థాలు, బొద్దింకలు, చెత్తా చెదారం నిండిన కిచెన్, కాలం చెల్లిన ఆహార పదార్థాలు, ఇలా ఒక్కటేమిటీ అన్నీ కంపే. ఇటీవలి కాలంలో తెలంగాణ రాజధాని ఘనత వహించిన హైదరాబాద్‌లో వరుస దాడుల్లో మన హోటళ్ల బండారం బయటపడింది. ఆకలితో నకనకలాడుతున్న వారంతా ఆవురావురుమని తింటున్న ఆహారపదార్థాలు కుళ్లిన, కాలం చెల్లిన పదార్థాలతో తయారు చేస్తున్నారని అధికారులు బయట పెట్టారు. ఎంతో నమ్మకంతో హోటల్‌కు వెళ్లిన వారికి ఇలాంటి తిండి పెడుతూ కోట్లు వెనుకుంటున్న హోటళ్లను మూసేయాల్సిందే. వారిని వెనక ఉండి నడిపిస్తున్న రాజకీయ నాయకుల భరతం పట్టాల్సిందే. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వారిని అస్సలు వదలడదు. ఎందుకంటే వీరి వండివారుస్తున్న తిండి వల్ల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. కొత్త కొత్త జబ్బులు కొని తెచ్చుకుంటున్నారు. ఇవన్నీ గుర్తించి ఇలాంటి హోటల్ వాళ్లపై కఠిన చర్యలు తీసుకుంటే తప్ప హైదరాబాద్ పరువు కాపాడుకోలేం. ఇటీవల నగరంలో వరుసగా ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడులు చేసి వండల సులు నమోదు చేశారు. ప్రఖ్యాత హోటళ్లలోనే కంపు కొట్టేలా కిచెన్‌లు ఉంటున్నాయి. కుళ్లిన మాంసాన్ని ఫ్రీజర్‌లో పెట్టి వండి మన ముఖాన పడేస్తున్నారు. ఇకపోతే మేక మాంసంలో ఎద్దుమాసం కలిపి అమ్ముతున్న వారు హోటళ్లకు డా దానిని సరఫరా చేస్తున్నారు. ఇవన్నీ చూస్తుంటే హైదరాబాద్ హోటళ్లు అంటేనే భయమేసేలా దారుణమైన పరిస్థితి తయారయ్యింది. కొంతకాలం పాటు ఎవకవరు డా హోటల్‌కు వెళ్లకుండా ఉంటే వారు దారికొచ్చేలా ఉన్నారు. ప్ర.లో హైదరాబాద్ అంటే ఎంతో పేరుంది. పర్యాటక రంగంలో ప్రపంచంలో మంచి స్థానం సంపాదించుకుంది. అంతర్జాతీయ పెట్టుబడులన్నీ హైదరాబాద్‌లోనే పెడుతున్నారు. ఐటి రంగంలో బాగా విస్తరించింది. అనేక అంతర్జాతీయ కంపెనీలు ఇక్కడ ఉన్నాయి. దీంతో దేశవిదేశీయులు అనేకమంది రోజూ హైదరాబాద్ సందర్శనకు వస్తుంటారు. ఇలాంటి ప్రతిభ ఉన్న భాగ్యనగరం కాస్తా మసకబారిపోతోంది. నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్లు ఇలా కుళ్లిన, కాలం చెల్లిన ఆహార పదార్థాలను వండిపెడితే వారి ఆరోగయం ఏం కాను. మనం తినే ఆహారం పరిస్థితి దారుణంగా ఉందన్న నిజాలు దాడులతో తెలిసింది. ఇటీవలి కాలంలో వరుసగా ఆహార భద్రతా అధికారులు జరిపిన మెరుపు దాడుల్లో వెలుగుచూసిన దృశ్యాలు చూ స్తుంటే, మనం తింటున్నది ఆహారమా లేక విషమా అనే భయం కలుగుతోంది. ఒకవైపు పర్యాటక భాగస్వామ్యాల గురించి చర్చలు జరుపుకుంటూనే, మరోవైపు మన నగరంలోని కనీస పరిశుభ్రతను డా కాపాడుకోలేక పోతున్నాం. ప్రజలు కూడా తమ పరిసరాలు కాపాడుకోవడం లేదు. నగరాన్ని చెత్తతో నింపి నరకపంగా మార్చేస్తున్నారు. ఇది రకమైన అభివృద్ధి అన్నది ప్రజలు ఆలోచించాలి. ట్రాఫిక్ జామ్‌లు, వరదలొస్తే నాలాలు పొండగం, రోడ్లు చెరువులను తలపించడం, ఎక్కడ పడితే అక్కడ చెత్తకుప్పలు తలపించడం దారుణం కాక మరోటి కాదు. ఇలాంటి దుర్భర పరిస్థితులు మంచిదా అన్నది ప్రజలు డా ఆలోచన చేయాలి. ఇది ఖచ్చితంగా మన నగరాన్ని మనమే చేజేతులా నాశనం చేసుకుంటున్నామని గుర్తించాలి. హైదరాబాద్ నగరం గ్లోబల్ వేదికగా మారుతున్న వేళ ప్రజలుగా మనమంతా ఎలా ఉండాలో తెలుసుకోవాలి. అందమైన ఆకాశ హర్మ్యాలు ఉంటే సరిపోదు. ఇక్కడికి వచ్చే పర్యాటకులు హైదరాబాద్ అందాలను చూసి మురిసి పోవాల్సిందే. అలాగే పరిశుభ్రత డా ఇక్కడ ముఖ్యం. అలాగే ఇక్కడ దొరి తిండి మంచిదనే భరోసా ఉండాలి. సామాన్యుడు కడుపు నిండా భోజనం చేసి, ఆరోగ్యంగా బయటకు వస్తాడనే భరోసా కల్పించడం పాలకుల ప్రాథమిక బాధ్యత. కానీ, నేడు పరిస్థితి దానికి విరుద్ధంగా ఉంది. అధికారులు దాడులు చేసిన ప్రతిసారీ గడువు ముగిసిన నిల్వలు, కుళ్ళిన మాంసం, అపరిశుభ్రమైన వంటశాలలు, ఎలుకలు, బొద్దింకల స్వైరవిహారం దర్శనమిస్తున్నాయి. ఇదంతా ఒరోజులో పుట్టుకొచ్చిన సమస్యలు కావు. సంవత్సరాల తరబడి వ్యవస్థలో పెనవేసుకుపోయిన అవినీతికి, అధికారుల నిర్లక్ష్యానికి, యజమానుల కాసుల కక్కుర్తికి నిదర్శనం. అధికారులు తనిఖీలు చేసి, ఏదో నామమాత్రపు జరిమానాలు విధించి, హోటల్ యజమానిని వదిలేయడం వల్ల వస్తున్న ఉపద్రవంగా గుర్తించాలి. హోటళ్లలో అపరిశుభ్రత, కాలం చెల్లిన పదర్థాలను వాడితే కఠిన చర్యలు ఉండాలి. అవసరమైతే ఆ హోట్‌లను మూసేయాలి. జరిమానాలు విధించాఇ. హోటల్ నిర్వహణలో నిబంధనలు పాటించకపోతే, అది ప్రజారోగ్యంతో చెలగాటంగానే చూడాలి. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న నేరంగా పరిగణించి, అందుకు తగ్గట్లుగా కఠిన చర్యలు తీసుకోవాలి. ఆయా హోటళ్ల యజమానులను రక్షించే రాజకీయ దగుల్బాజీలను పట్టుకోవాలి. దాడులు జరిగినప్పుడు కొన్ని రోజులు హడావుడి చేయడం, ఆ తర్వాత మళ్లీ మామూలే అనిపించడం వల్లనే ఈ వ్యాపారస్తుల్లో ఏమాత్రం భయం ఉండటం లేదు. నిజానికి, మన నగరం ప్రపంచ స్థాయి పర్యాటక ంద్రంగా ఎదగాలంటే, హోటల్ పరిశ్రమలో కఠినమైన 'ఫుడ్‌సేఫ్టీ ఆడిట్' విధానాన్నితీసుకు రావాలి. నిబంధనలు అతిక్రమించిన హోటల్ లైసెన్స్‌ను శాశ్వతంగా రద్దు చేయాలి. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా కఠిన చర్యలు తీసుకుంటారన్న భయం కల్పించాలి. అప్పుడే మన హోటల్ వ్యవస్థ బాగుపడుతుంది. లేకుంటే ఇలాగే కుళ్లిన ఆహార పదార్థాలతో ప్రజల ప్రాణాలతో చెలగటం తప్పదు.

హోటల్ నిర్వహణలో నిబంధన లు పాటించకపోతే, అది ప్రజారోగ్యంతో చెలగాటంగానే చూడాలి. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న నేరంగా పరిగణించి, అందుకు తగ్గట్లుగా కఠిన చర్యలు తీసుకోవాలి. ఆయా హోటళ్ల యజమానులను రక్షించే రాజకీయ దగుల్బాజీలను పట్టుకోవాలి. దాడులు జరిగినప్పుడు కొన్ని రోజులు హడావుడి చేయడం, ఆ తర్వాత మళ్లీ మామూలే అనిపించడం వల్లనే ఈ వ్యాపారస్తుల్లో ఏమాత్రం భయం ఉండటం లేదు.

సీఎం పర్యటన ఏర్పాట్లపై క్షేత్రస్థాయి సమీక్ష

- **జగన్నాథపురం సభకు జిల్లా యంత్రాంగం పూర్తి సన్నద్ధం**
- **సభా వేదిక, హెలిప్యాడ్, భద్రతా ఏర్పాట్లపై అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం**





ప్రజానావ, ఖమ్మం: జిల్లాలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి అన్ని శాఖలు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలోని చింతకాని మండలం జగన్నాథపురం (మత్తెపల్లి) వద్ద నిర్వహించనున్న బహిరంగ సభకు తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్న నేపథ్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించారు. పోలీసు కమిషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్లు పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డితో కలిసి సభా ప్రాంగణం, హెలిప్యాడ్, వాహనాల పార్కింగ్ ప్రాంతాలు, ప్రజల రాకపోకలకు అనువైన మార్గాలు, భద్రతా ఏర్పాట్లను సమగ్రంగా పరిశీలించి ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం కోసం పకడ్బందీ చర్యలపై వివిధ శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 30న భారీ బహిరంగ సభ నిర్వహించి రైతు భరోసా కార్యక్రమాన్ని ప్రారంభించాలని నిర్ణయించినప్పటికీ, భారీ వర్షాలు, వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో కార్యక్రమాన్ని వాయిదా వేయాల్సి వచ్చిందని గుర్తు చేశారు. ఉప ముఖ్యమంత్రి సమక్షంలో జరిగిన సమీక్షలో కూడా వాతావరణ పరిస్థితులు అనుకూలించిన తర్వాత కొత్త తేదీ నిర్ణయిస్తామని వెల్లడించినట్లు తెలిపారు. వాతావరణ శాఖ జూలై 6 వరకు భారీ వర్షాల సూచనలు చేసిన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అప్రమత్తంగా వ్యవహరించిందన్నారు. అయితే ఊహించిన స్థాయిలో వర్షాలు నమోదు కాకపోవడంతో సభ నిర్వహించాల్సిన ప్రాంగణాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిస్థితులను అంచనా వేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం సభా ప్రాంగణం దాదాపు పూర్తిగా ఎండిపోయి కార్యక్రమం నిర్వహణకు అనుకూలంగా ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు తెలిపారు. ఈ మేరకు జిల్లా యంత్రాంగం చేసిన ఏర్పాట్లు, ప్రాంగణ పరిస్థితులు, ఇతర అంశాలపై వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి, ముఖ్యమంత్రి కార్యాలయానికి నివేదిక అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కార్యక్రమానికి సంబంధించిన తేదీని ప్రభుత్వం త్వరలో అధికారికంగా ఖరారు చేస్తుందని, తేదీ నిర్ణయమైన వెంటనే ప్రజలకు సమాచారం అందజేస్తామని తెలిపారు. అప్పటి వరకు అన్ని శాఖలు పూర్తి సన్నద్ధతతో ఉండి అవసరమైన ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. సభకు భారీ సంఖ్యలో రైతులు, ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున సభా వేదిక నిర్మాణం, హెలిప్యాడ్ ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్, ప్రజల కూర్చునే ఏర్పాట్లు, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే వ్యవస్థలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన అన్ని ప్రోటోకాల్ ఏర్పాట్ల నిబంధనలకు అనుగుణంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అలాగే సభకు హాజరయ్యే రైతులు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీటి సౌకర్యం, నిరంతర విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, తాత్కాలిక మరుగుదొడ్లు, వైద్య శిబిరాలు, అంబులెన్స్ సేవలు, అగ్నిమాపక ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు, భద్రతా బందోబస్తును సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్, రెవెన్యూ, పోలీసు, విద్యుత్, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

జిల్లాలో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తి

- **అర్హులైన ఒక్క ఓటరు కూడా హక్కు కోల్పోకుండా చర్యలు**
- **డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేస్తున్నాం**
- **కలెక్టర్ దివాకర టీఎస్**



ప్రజానావ, ఖమ్మం: ఖమ్మం జిల్లాలో అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు కూడా తన ఓటు హక్కును కోల్పోకుండా అన్ని విధాలా పక్కా చర్యలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ స్పష్టం చేశారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఇప్పటికే 99.5 శాతం ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తయిందని, అలాగే 20.9 శాతం ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను కూడా పూర్తి చేసినట్లు తెలిపారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో చింతకాని మండలం జగన్నాధపురం నుంచి జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి పాల్గొన్నారు. కలెక్టరేట్ నుంచి మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య కూడా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం ప్రతిరోజూ సుమారు 5 శాతం చొప్పున ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ కొనసాగుతోందని, దీనిని మరింత వేగవంతం చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో పనితీరు బలహీనంగా ఉన్న బూత్ లెవల్ అధికారులను (బీఎల్‌వోలు) గుర్తించి వారికి సహాయంగా సూపర్‌వైజర్లను నియమించినట్లు చెప్పారు. ఓటర్లకు అవసరమైన మార్గదర్శకత్వం, సహాయం అందించేందుకు జిల్లాలోని అన్ని మండల రెవెన్యూ కార్యాలయాలు, జిల్లా కలెక్టరేట్‌లో ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. అవసరమైన ధృవీకరణ పత్రాలు పొందేందుకు దరఖాస్తు చేసుకునే ఓటర్లకు అధికారులు పూర్తి సహకారం అందిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా మంగళవారంలోగా ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ వంద శాతం పూర్తి కావాలని సూచించారు. ఇళ్లకు వెళ్లిన సమయంలో తాళం వేసి ఉంటే వాటిని అబ్సెంట్‌గా నమోదు చేయాలని, అవసరమైతే మళ్లీ సందర్శించి ఫారాలను అందజేయాలని సూచించారు. అందజేసిన ప్రతి ఎన్యూమరేషన్ ఫారాన్ని బీఎల్‌వోలు తిరిగి సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. పూరించిన ఫారాలపై తప్పనిసరిగా ఓటర్ల సంతకాలు ఉండేలా చూడాలని, పట్టణ ప్రాంతాల్లో ఎస్ఐఆర్ పనులతో పాటు పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియను కూడా గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ అన్సారీతో పాటు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అంబేద్కర్ భవనం పనులు వేగవంతం చేయాలి

- **నిర్దేశిత గడువులో నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులకు కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశం**

ప్రజానావ, యాదాద్రి భువనగిరి: జిల్లాలోని భువనగిరి మున్సిపాలిటీ పరిధిలో సింగన్నగూడెంలో నిర్మాణంలో ఉన్న అంబేద్కర్ భవనం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన భవన నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్దేశిత గడువులో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతేగాక భవనం ముందు సీసీ రోడ్డు నిర్మాణం, గ్రీనరీ అభివృద్ధి, పరిసరాల సుందరీకరణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రజలకు పూర్తిస్థాయిలో ఉపయోగపడేలా అన్ని మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తాం

- **రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ ప్రారంభం**
- **అన్ని వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం**
- **మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి**



ప్రజానావ, గజ్వేల్: ప్రజా ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడం ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం ములుగు మండల కేంద్రంలోని కేవీఎస్ఆర్ గార్డెన్స్‌లో ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామితో కలిసి రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ప్రజల ఆశీర్వాదాలతోనే ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని, రాష్ట్రం ఆర్థిక ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నప్పటికీ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ, ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం, గృహ జ్యోతి వంటి పలు సంక్షేమ పథకాలను ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. పేదల చిరకాల స్వప్నమైన సొంత ఇంటి నిర్మాణం కోసం మొదటి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశామని, ప్రతి నియోజకవర్గానికి 3,500 చొప్పున కేటాయించామని తెలిపారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 1.30 లక్షల గృహప్రవేశాలు పూర్తయ్యాయని, మరో 80 వేల ఇండ్లు గృహప్రవేశానికి సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు. కులం, మతం అనే తేడా లేకుండా పేదరికాన్ని ప్రామాణికంగా తీసుకొని ఇండ్లు మంజూరు చేస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు ప్రతి సోమవారం ఆడబిడ్డల పేరున నిధులు విడుదల చేస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రెండో విడతలో రెండున్నర లక్షల గృహాల పంపిణీ ప్రారంభమైందన్నారు. గతంలో వివిధ పథకాల కింద నిర్మాణం చేపట్టి అసంపూర్తిగా ఉన్న ఇండ్లలో ప్రతి నియోజకవర్గానికి 500 చొప్పున పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఎలాంటి సిఫార్సులు లేకుండా పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు జరుగుతోందని పేర్కొన్నారు. సిద్ధిపేట, గజ్వేల్ నియోజకవర్గాల్లో అధికంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం జరుగుతోందని తెలిపారు. అర్హులైన పేదలకు నాలుగు విడతల్లో మంజూరు కల్పిస్తామని చెప్పారు. గత పదేళ్లలో ప్రతి ఏడాది లక్ష ఇండ్లు ఇచ్చి ఉంటే రాష్ట్రంలో పూరిగుడిసెల పరిస్థితి ఉండేది కాదని వ్యాఖ్యానించారు. ఇందిరమ్మ లబ్ధిదారులకు ఉచితంగా ఇసుక సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ సొంత ఇల్లు ప్రతి పేద కుటుంబం కల అని, మధ్యవర్తులు లేకుండా నేరుగా లబ్ధిదారులకే నిధులు అందిస్తూ పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపడుతున్నామని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల వంటి భారీ పథకం దేశంలో మరెక్కడా లేదన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రతి నియోజకవర్గానికి రెండో విడతలో 2,000 ఇండ్లు మంజూరు చేస్తామని చెప్పారు. లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా యాప్ ద్వారా ఉచిత ఇసుక సరఫరా చేస్తున్నామని తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ మంజూరు చేస్తామని, నాణ్యమైన విద్య కోసం రాష్ట్రవ్యాప్తంగా 50 వేల ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచామని, కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశామని, త్వరలో కొత్త పింఛన్లు కూడా మంజూరు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ రాష్ట్ర ఎండీ వీపీ గౌతమ్, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపల్లి చంద్రం, గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ, వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ విజయ మోహన్, ములుగు సర్పంచ్ కనకయ్య, తహసీల్దార్ రవీందర్ రెడ్డి, ఎంపీడీవో మేరీ స్వర్ణకుమారి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



10న విద్యాసంస్థల బంద్

ప్రజానావ, ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో: వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జూలై 10న నిర్వహించనున్న రాష్ట్రవ్యాప్త విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి బలముల ప్రేమ్ కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం అచ్చంపేట నియోజకవర్గంలోని ప్రగతి జూనియర్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. ఈ బంద్‌లో విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. సమావేశంలో నాయకులు మధు, ఆసిఫ్, లక్ష్మణ్, ప్రవీణ్, ప్రవళిక, అనూష తదితరులు పాల్గొన్నారు.

సర్‌కు రాజకీయ పార్టీల సహకారం అవసరం

- **పారదర్శకమైన, తప్పులులేని ఓటరు జాబితా రూపొందించడమే లక్ష్యం**
- **కలెక్టర్ ప్రతీక్ జైన్**



ప్రజానావ, నంగారెడ్డి: జిల్లాలో చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (సర్) కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి పారదర్శకమైన, తప్పులులేని ఓటరు జాబితాను రూపొందించేందుకు గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ కోరారు. సోమవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండులతో కలిసి గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్ కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 94 శాతం ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ పూర్తయిందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రక్రియ వేగంగా కొనసాగుతుండగా, పట్టణ ప్రాంతాల్లో కూడా మరింత వేగవంతం చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ నెల 24వ తేదీలోపు ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, డిజిటైజేషన్ ప్రక్రియను పూర్తి చేసేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేసి ఫారాల నింపడంలో సహాయం చేయడంతో పాటు, స్వీకరించిన ఫారాలను వెంటనే డిజిటైజ్ చేసేలా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లను చురుకుగా వినియోగించుకోవాలని, ఓటర్లకు అవగాహన కల్పించి కార్యక్రమం విజయవంతానికి సహకరించాలని సూచించారు. అలాగే ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, డిజిటైజేషన్ ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల నుంచి వచ్చే సూచనలు, సలహాలను స్వాగతిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, ఈఆర్‌వోలు, తహసీల్దార్లు, ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



కార్మిక సమస్యల పరిష్కారానికి యాజమాన్యం కట్టుబాటు

- జీఎం కార్యాలయంలో అధికారులు–కార్మిక సంఘాల నేతల నిర్మాణాత్మక సమావేశం
- సంక్షేమం, భద్రత, మౌలిక వసతులపై విస్తృత చర్చ

ప్రజానావ, రామగుండం: రామగుండం ఏరియా–1 జీఎం కార్యాలయంలో సోమవారం గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ప్రతినిధులు, ఆర్జీ–1 వివిధ విభాగాల అధికారులతో ఏరియా స్థాయి నిర్మాణాత్మక సమావేశం ఎస్‌వో టు జీఎం చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెలలో జరిగిన నిర్మాణాత్మక సమావేశంలో తీసుకున్న నిర్ణయాల్లో కొన్ని ఇప్పటికే అమలయ్యాయని, మరికొన్ని పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని తెలిపారు. మిగిలిన సమస్యలను కూడా సానుకూల వాతావరణంలో దశలవారీగా పరిష్కరించేందుకు యాజమాన్యం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. సమావేశంలో కార్మికుల సంక్షేమం, భద్రత, మౌలిక సదుపాయాలు, వైద్య సేవలు, తాగునీటి సౌకర్యం, భూగర్భ గనుల్లో అవసరమైన సామగ్రి సరఫరా, లైటింగ్ సౌకర్యాలు, హ్యాండ్ గ్లోవ్స్, వాటర్ స్ప్రింక్లర్లు, గిర్డర్ల మార్పిడి, కార్యాలయ సదుపాయాల మెరుగుదల, కంప్యూటర్ల ఏర్పాటు, పర్సనల్ విభాగానికి సంబంధించిన సమస్యలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో ఏఐటీ యూసీ గుర్తింపు సంఘం డిప్యూటీ జనరల్ సెక్రటరీ మడ్డి ఎల్లగౌడ్, సెంట్రల్ సెక్రటరీ కె. స్వామి, డిప్యూటీ బ్రాంచ్ సెక్రటరీ రంగు శ్రీను, అధికారులు ఎ. ఆంజనేయులు ఏజీఎం, ఐఈడీ, ఏరియా ఇంజనీర్ రాజాజీ, డాక్టర్ కారం పద్మ, ఎల్. రమేష్ ఏజెంట్, డి. రమేష్ ఓసీ–5 పీఓ, కె.డి.ఎన్. వరప్రసాద్ డీజీఎం సివిల్, డీజీఎం సీఎస్‌పీ ఫైడిశ్వర్, డీజీఎం ఏరియా వర్క్‌షాప్ జితేందర్ సింగ్, ఎం. రవీందర్ రెడ్డి పర్సనల్ మేనేజర్, స్టాట్యుటరీ మేనేజర్ రమేష్ బాబు, డీవైపీఎం వేణు, సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి, యూనియన్ ప్రతినిధులు ఎం. మహేష్, ఎన్. రాజు, మల్లికార్జున్, జి. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీ–2 అధికారుల పోరాటం మరింత ఉధృతం

- 8వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు
- డిమాండ్లు పరిష్కరించే వరకు ఉద్యమం ఆగదంటున్న అధికారులు



ప్రజానావ, రామగుండం: ఆర్జీ–2 ఏరియా జనరల్ మేనేజర్ కార్యాల యం ఎదుట అధికారులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారంతో ఎనిమిదో రోజుకు చేరుకున్నాయి. తమ న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అధికారులు నిరసన కార్యక్రమాన్ని మరింత ఉధృతంగా కొనసాగిస్తున్నారు. అధికారులంద రూ ఒకే వేదికపై ఐక్యంగా నిలిచి తమ నిరసనను వ్యక్తం చేయడంతో పాటు సంఘీభావాన్ని చాటారు. తమ హక్కుల సాధన కోసం అందరూ కలిసికట్టుగా పోరాడుతామని ఈ సందర్భంగా నినాదాలు చేశారు. ఉదయం నుంచి ఉత్సాహభరితంగా సాగిన ఎనిమిదో రోజు రిలే నిరాహార దీక్ష సాయంత్రం 5.30 గంటలకు ముగిసింది. దీక్షలో పాల్గొన్న అధికా రులకు మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు సంఘీభావం ప్రకటిం చారు. అనంతరం టీబీజీకేఎస్ నాయకుడు ఐలి శ్రీనివాస్, బీఎంఎస్ నాయకుడు యాదగిరి సత్తయ్య, రామగుండం–2 ఏరియా అధికారులు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా అధికారుల సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ యాజమాన్యం తమ సమస్యలపై స్పందించి తగిన పరిష్కారం చూపేంత వరకు ఉద్యమాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ విరమించబోమని స్పష్టం చేశారు. అవసరమైతే రాబోయే రోజుల్లో నిరసన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

అర్హులైన మైనింగ్ స్టాఫ్‌కు వెంటనే ప్రమోషన్లు ఇవ్వాలి

- కేడర్ స్కీమ్ అమలు చేయాలని ఏఐటీయూసీ డిమాండ్
- ఆర్జీ–1 జీఎంకు వినతిపత్రం సమర్పణ



ప్రజానావ, రామగుండం: సింగరేణిలో 2016–17 బ్యాచ్‌లకు చెందిన సీనియర్ మైనింగ్ సర్దార్ (ఓఎంఒచ్)లకు కేడర్ స్కీమ్ ప్రకారం మూడేళ్ల సర్వీసు పూర్తయిన అనంతరం ఓవర్‌మెన్ గ్రేడ్–బి హోదాకు అర్హత ఉన్నప్పటికీ, ఓవర్‌మెన్ ఖాళీలు లేవు అనే కారణంతో వారి ప్రమోషన్లను అనవసరంగా నిలిపివేస్తున్నారని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆర్జీ–1 బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను ఆరోపించారు. సోమవారం ఏఐటీయూసీ ఆర్జీ–1 బ్రాంచి ఆధ్వర్యంలో ఆర్జీ–1 జనరల్ మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, సింగరేణిలో సీనియర్ మైనింగ్ సర్దార్‌లకు ఓవర్‌మెన్ ప్రమోషన్లు ఇవ్వకుండా వారితో నిరంతరం ఓవర్‌మెన్ విధులు నిర్వహింపజేస్తున్నారని విమర్శించారు. దీని కారణంగా సంస్థలో వాస్తవానికి ఓవర్‌మెన్ అవసరం ఉన్నప్పటికీ ఖాళీలు ప్రతిబింబించడం లేదని, ఓవర్‌మెన్ పోస్టుల ఖాళీలు కృత్రిమంగా తగ్గినట్లుగా కనిపిస్తూ అర్హులైన ఉద్యోగులకు రావాల్సిన ప్రమోషన్లు దాదాపు మూడు సంవత్సరాలుగా ఆలస్యం అవుతున్నాయని పేర్కొన్నారు. ఈ పరిస్థితి కేడర్ స్కీమ్ ఉద్దేశ్యానికి, ఉద్యోగుల న్యాయమైన హక్కులకు పూర్తిగా విరుద్ధమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లగౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, ఆర్జీ–1 బ్రాంచి ఆఫీస్ బేరర్స్ మాదన మహేష్, సిద్ధమల్ల రాజు, సిర్ర మల్లికార్జున్, గండి ప్రసాద్, పిట్ కార్యదర్శులు ఇజ్జగిరి రాజు, మైనింగ్ స్టాఫ్ నాయకులు పెర్క మహేం దర్, శ్రీనివాస్, గొడిశెల నరేశ్ తదితరులు పాల్గొన్నారు.



ముగిసిన వేణుగోపాలస్వామి అధ్యయనోత్సవాలు

- వైభవంగా నిర్వహించిన శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత కళ్యాణోత్సవం

ప్రజానావ, వేములవాడ : రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో లోకకళ్యాణార్థం జూలై 2 నుండి జూలై 6, 2026 వరకు నిర్వహించిన అధ్యయనోత్సవాలు మరియు శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి వారి కళ్యాణోత్సవం – భక్తోత్సవం సోమ వారం అత్యంత వైభవంగా ముగిశాయి. ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజూ ఉదయం 6:30 గంటల నుంచి స్వామివారికి పంచోపనిషత్ మంత్రాలతో అభిషేకం, అర్చన కార్యక్రమాలు నిర్వహిం చారు. సాయంత్రం 4:05 గంటల నుంచి తొళ్లెక్కం, ద్రావిడ వేదపారా యణం, నీరాజనం, మంత్ర పుష్పం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సోమవారం ఉదయం 11:30 గంటలకు శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి వారి దివ్య కళ్యాణోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి, సదస్యం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. రాత్రి 8:30 గంట లకు ఏకాంత సేవతో ఐదు రోజుల ఉత్సవాలు సంపూర్ణంగా ముగిశాయి. ఈ దివ్య కళ్యాణ మహోత్స వానికి కన్యాదాతలుగా శ్రీ భాను ఆచార్య – శ్రీమతి క్రాంతి దంపతులు సేవలందించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈవో) శ్రీమతి ఎల్. రమాదేవి పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమె వెంట ఏఈవో శ్రావణ్ కుమార్, పర్యవేక్షకులు నరేందర్, ఆలయ ఇన్‌చార్జి స్థానాచార్యులు, ఆలయ అర్చకులు, వేదపండితులు, వైష్ణవ అర్చకులు పాల్గొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు ఉత్సవాలకు హాజరై స్వామివారి దివ్య ఆశీస్సులు పొందారు. కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

త్వరగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

- ములుగు జిల్లాలో త్వరలో సీఎం పర్యటన
- మేడారం మాస్టర్ ప్లాన్, యూరియా సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు మంత్రి సీతక్క ఆదేశం



ప్రజానావ, ములుగు: మేడారం సమ్మక్క–సారలమ్మ ఆలయ అభివృద్ధి, మాస్టర్ ప్లాన్ అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రస్తుత వర్షాకాలంలో జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండా లని, జిల్లాలో కొనసాగుతున్న పెండింగ్ అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశిం చారు. సోమవారం కలెక్టరేట్‌లో మంత్రి సీతక్క జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావుతో కలిసి మేడారం ఆలయ అభివృద్ధి, పారిశుధ్య నిర్వహణ, ఐడీఓసీ పనుల పురోగతి, రామచంద్రపురం భూసర్వే, పైలాన్ నిర్మాణం, వర్షాల పరిస్థితి, రాష్ట్ర ముఖ్యమం త్రి పర్యటనకు సంబంధించి చేపట్టాల్సిన సన్నాహక చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించి అధికారుల కు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి త్వరలో ములుగు జిల్లాలో పర్యటించే సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టేలా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. జాతీయ రహదారి పక్కన గట్టమ్మ దేవాలయం సమీపంలో పంచాయతీరాజ్ రోడ్డు పనులకు భూమిపూజతో పాటు నూతన కలెక్టరేట్, మెడికల్ కాలేజ్, నర్సింగ్ కాలేజ్, కేంద్రీయ విద్యాలయం, పొట్లాపూర్ లిఫ్ట్ ఇరిగేషన్, కరకట్టల నిర్మాణం తదితర కీలక అభివృద్ధి పనుల ప్రారంభోత్స వాలు, శంకుస్థాపనలకు సంబంధించిన ప్రతిపాదన లు సిద్ధం చేయాలని సూచించారు. జిల్లాలో చేపట్టిన ప్రధాన అభివృద్ధి కార్యక్రమాలను ఒకే శిలాఫలకంపై పొందుపరిచి రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఆవిష్కరించేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. మేడారం సమ్మక్క–సారలమ్మ ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్న మంత్రి, ఆలయ పరిసరాల్లో భూసేకరణ, రహదారుల విస్తరణ, క్యూ లైన్ల పునర్వ్యవస్థీకరణ, అతిథి గృహం, ఆసుపత్రి, కాటేజీలు, పార్కింగ్, పారిశుధ్య సదుపాయాలు, జంపన్న వాగు పరిసరాల అభివృద్ధి తదితర అంశాలతో సమగ్ర మాస్టర్ ప్లాన్ రూపొందించాలని సూచించారు. జిల్లాలో కొనసాగు తున్న అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించిన ఆమె, రామచంద్రపురం పరిధిలోని 10,600 ఎకరాల భూముల రీసర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని, పొట్లాపూర్ లిఫ్ట్ ఇరిగేషన్, రామప్ప–లక్నవరం పైప్‌లైన్ పనులను వేగవంతం చేయాలని సూచించా రు. రైతులకు యూరియా కొరత తలెత్తకుండా తగిన నిల్వలు, సరఫరా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు వరదల సమయంలో అత్యవసర పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని, వర్షాకాలంలో తాగునీరు కలుషితం కాకుండా పర్యవేక్షణ చేపట్టాల ని, అటవీశాఖ ఆధ్వర్యంలో వివిధ రకాల మొక్కలను అందుబాటులో ఉంచి విస్తృత స్థాయిలో మొక్కల నాటకం చేపట్టాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జిల్లా పరిపాలన, పోలీసు, ఎండోమెంట్స్, పారిశుధ్య, వైద్య, గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్ శాఖలు పరస్పర సమన్వ యంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశం లో జిల్లా ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పో, జిల్లా అటవీ అధికారి వికాస్ మీనా, అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జీ, ఎం. సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, మున్సిపాలిటీ చైర్‌పర్సన్ చింతనిప్పుల చంద్రకళ, పంచాయతీరాజ్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి, ఆర్డీవో కృష్ణవేణి, డీఆర్వో రవి కుమార్, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కుల, మత రహిత సమాజ నిర్మాణం కోసం కృషి చేయాలి

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్
- సిరిసిల్లలో ఘనంగా బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి



ప్రజానావ, సిరిసిల్ల : బాబు జగ్జీవన్ రామ్ రాజకీయ ప్రస్థానం దేశ చరిత్రలోనే చిరస్మరణీయమైనదని జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు నాగుల సత్యనారాయణ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణంలో భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సూర దేవరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి నాగుల సత్యనారాయణ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సూర దేవరాజు మాట్లాడు తూ..బాబు జగ్జీవన్ రామ్ ఆశయ సాధనే మనం వారికి ఇచ్చే నిజమైన నివాళి. కులమత రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకునూరి బాలరాజు, ఆర్టీఏ మెంబర్ సంగీతం శ్రీనాథ్, మున్సిపల్ కౌన్సిలర్లు కూరపాటి శ్రీశైలం, బొద్దుల శ్రీనివాస్ రాజు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాగుల జగన్, మహిళా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు కొలనూరి రమాదేవి, కాంగ్రెస్ నాయకులు కత్తెర దేవదాసు, రాము, మంగ, కిరణ్‌లతో పాటు పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రాజరాజేశ్వర స్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.11 లక్షల విరాళం

ప్రజానావ, వేములవాడ : రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని రాజరాజేశ్వర స్వామి దేవస్థానం నిత్యాన్నదాన ట్రస్టుకు హనుమకొండ జిల్లా పరకాలకు చెందిన శ్రీ చంద్రమౌళి – శ్రీమతి కమల దంపతులు రూ.11 లక్షల విరాళాన్ని అందజేశారు. దేవస్థానం పీఆర్వో కార్యాలయంలో ఆలయ కార్య నిర్వహణాధికారి (ఈవో) శ్రీమతి ఎల్. రమాదేవి గారికి వారు చెక్కు రూపంలో విరాళాన్ని అందించా రు. అనంతరం స్వామివారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, వేదపండితులు వారికి స్వామివారి శేషవ స్త్రం, లడ్డు ప్రసాదం అందించి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమం లో దేవస్థానం ప్రోటోకాల్ అధికారి అశో క్ కుమార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. అన్నదానం మహాదా న అనే సనాతన ధర్మ సూ త్రాన్ని ఆచరిస్తూ నిత్యా న్నదాన ట్రస్టుకు ఉదారంగా విరాళం అందించిన దాతలను ఆలయ అధికారులు అభినందించి, స్వామివారి అనుగ్రహం వారికి, వారి కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షి ంచారు.

ప్రజావాణిలో 80 అర్జీల స్వీకరణ

- ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం వద్దు
- దరఖాస్తులను ప్రాధాన్యతతో పరిష్కరించాలని అధికారులకు కలెక్టర్ ఆదేశం

ప్రజానావ, కామారెడ్డి: కామారెడ్డి జిల్లా కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్ర మంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మొత్తం 80 దరఖాస్తులను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ స్వీకరించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో అర్జీదా రులను నేరుగా కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్న కలెక్టర్, అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులకు పంపిస్తూ వాటిని నిబంధనల మేరకు ప్రాధాన్యతతో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. అనం తరం ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై సమీక్ష నిర్వహించారు. తహసీల్దార్లు, జిల్లా స్థాయి అధికారులు ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులతో పాటు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు సంబం ధించిన పనులను కూడా సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ప్రజావాణిలో అందిన ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం చోటుచేసుకోకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు విక్టర్, ఎన్‌వీ గిరి, పీడీసీ రవితేజ, డీఆర్ఓ పాండు, జడ్పీ సీఈఓ చందర్, జిల్లా స్థాయి అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సిరిసిల్లలో వేగం పుంజుకున్న సర్ ప్రక్రియ

- వర్షాల అటంకాలను అధిగమిస్తూ పనుల కొనసాగింపు
- గాంధీనగర్ కమ్యూనిటీ హాల్ లో మూడు బూత్ లకు సంబంధించి పెరిగిన ఓటర్ల స్పందన



ప్రజానావ, సిరిసిల్ల : సిరిసిల్ల పట్టణంలో నిర్వహిస్తు న్న ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంకెన్సివ్ రివిజన్) ప్రత్యేక సమగ్ర సవరణ పనులు వేగం పుంజుకున్నది. ముఖ్యంగా పట్టణంలోని గాంధీనగర్ హనుమాన్ దేవాలయ కమ్యూనిటీ హాలులో మూడు బూత్ కు సంబంధించిన ఎ న్యూమరేషన్ ఫారాల స్వీకరణ కొనసాగుతున్నది. గత రెండు రోజులుగా వర్షా ల కారణంగా బి ఎల్ వో లు ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణ కార్యక్రమానికి తీవ్ర ఆటంకం కలిగింది. అయితే స్థానిక ప్రజాప్రతినిధుల సూచన మేరకు కమ్యూనిటీ హాల్ లో పూర్తిచేసిన గణన పత్రాలను స్వీకరించి డిజిటలైజేషన్ కొనసాగి స్తున్నారు మరోవైపు అందుబాటులో లేకుండా ఎన్యూమరేషన్ ఫారాలను పొందని వారికి పంపిణీ చేస్తున్నారు. ఇక్కడ 121, 122, 123 పోలింగ్ బూత్ లకు సంబంధించిన ఎస్ఐఆర్ పనులను బి ఎల్‌వోలు సిరిమల్ల మల్లేశ్వరి, పద్మ, కొండబత్తిని మమత లు చురుగ్గా కొనసాగిస్తున్నారు. ఇప్పటివరకు సుమారు గా 700 పైచిలుకు గణన పత్రాలు స్వీకరించినట్లు తెలిపారు. ఒకవైపు ఓటర్ల ఇంటింటికి వెళుతూ స్థానికంగా అందుబాటులో లేని వారి కోసం కమ్యూనిటీ హాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఇంకా అనేకమందికి పలు అనుమానాలు సరైన అవగాహన లేకపోవడంతో పత్రాలు సరిగా నింపడం లేదని వాటిని సవారిస్తూ అవసరమైన సూచనలు చేస్తూ ఎస్ ఐ ఆర్ పనులు కొనసాగిస్తున్నట్లు బిఎల్వోలు ప్రజానావకు తెలిపారు.



ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి

- కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ప్రజావాణికి 144 దరఖాస్తుల రాక

ప్రజానావ, సిరిసిల్ల : ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను నిర్దేశిత గడువులో గా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 144 దరఖాస్తులు రాగా, సంబంధిత శాఖల అధికారులకు అందజేసి.. త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రజావాణి కి వచ్చే దరఖాస్తులు నిర్దేశిత సమయంలోగా పరిష్కరించాలని ఆదేశించారు. హైదరాబాద్‌లో నిర్వహించే ప్రజావాణికి వచ్చే దరఖాస్తులు ఎప్పటికప్పు డు పరిశీలించి.. పరిష్కరించాలని సూచించారు. అలాగే సిరిసిల్ల, వేముల వాడ ఆర్డీవో కార్యాలయాల్లో ప్రజావాణి నిర్వహించి.. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. సిరిసిల్ల ప్రజావాణికి 4, వేములవాడ ప్రజావాణికి రెండు దరఖాస్తులు వచ్చాయి. వాటిని సంబంధిత శాఖల అధికారులకు అందించి.. పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణిలో జిల్లా అటవీ శాఖ అధికారి సత్యనారాయణ, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళిక ప్రకారం చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలి

- మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి
- కలెక్టర్ గరిమ అగ్రవాల్

ప్రజానావ, సిరిసిల్ల : విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే విద్యార్థులు ప్రణాళిక ప్రకారం చదవాలి.. ఉన్నత స్థానాలకు ఎదగాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకాంక్షించారు. తంగళ్లపల్లి మండలం మండేపల్లిలోని టీజీ టీడబ్ల్యూయూ ఆర్జేసీ విద్యా లయంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సోమ వారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా స్టోర్ రూమ్ లో బియ్యం, పప్పులు, గుడ్లు ఇతర ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు సిద్ధం చేసిన అన్నం, ఇతర ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థు లు భోజనం చేస్తుండగా, వారితో జిల్లా కలెక్టర్ కూర్చొని.. మాట్లాడారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా అని అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం కోడిగుడ్లు, పాలు, ఇతర పదార్థాలపై ఆరా తీశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడు తూ.. విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే ప్రతి విద్యార్థి ఒక ప్రణాళిక ప్రకారం చదవాలని సూచించారు. ఉత్తమ ప్రతిభ చూపి.. తాము అనుకున్న లక్ష్యం చేరుకోవాలని ఆకాంక్షించారు. ఉన్నత స్థానాలకు ఎదగాలని పేర్కొన్నారు.



చేపల ఉత్పత్తి పెరుగుదలతో మత్స్యకారులకు ఆదాయం

- కలెక్టర్ గరిమ అగ్రవాల్
- వరల్డ్ బ్యాంక్ ప్రతినిధులు, కేంద్ర ప్రభుత్వ అధికారులతో భేటీ
- నర్సింగాపూర్‌లో పర్యటించిన ప్రతినిధులు

ప్రజానావ, సిరిసిల్ల : ప్రభుత్వ పథకాలతో చేపల ఉత్పత్తి పెరుగుదలతో మత్స్యకారులకు ఆదాయం వృద్ధి చెందుతుందని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ప్రపంచ బ్యాంక్ బృందం, కేంద్ర ప్రభుత్వ అధికారులు, జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు చైర్మన్ కమిటీ .. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్‌ను జిల్లా సమీ కృత కార్యాలయాల సముదాయంలో సోమవారం కలిశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడు తూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలతో మత్స్యకా రుల ఆర్థిక వృద్ధికి దోహద పడుతుందని తెలిపారు. దీంతో చేపల ఉత్పత్తి పెరుగుతుందని మత్స్యకారుల సంక్షేమ, అభివృద్ధి కొనసాగుతుందని తెలిపారు. సహకార సంఘాలకు ఆర్థిక సహాయం అంశాలను కమిటీ సభ్యులకు వివరించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి.. బోయినపల్లి మండలంలోని నర్సింగా పూర్ గ్రామంలో చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని బృందం సందర్శించింది. ఉత్పత్తి వివరాలు, ఆదా యం, నిర్వహణ పై అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో వరల్డ్ బ్యాంక్ బృందం కమిటీ సభ్యులు జూలియన్ మిలియన్, అనుజా శుక్లా, ఆర్పీ సిలార్డ్, ఇంతిసార్ ఎ. సిద్ధికీ, దీపా సుమన్, జిల్లా మత్స్య శాఖ అధికారి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

జమ్మూకశ్మీర్ భారత్‌లో అంతర్భాగమే

- ఆర్టికల్ 370 రద్దుతో ప్రజలకు నిజమైన స్వేచ్ఛ లభించింది
- పునరుద్ధరణకు అవకాశమే లేదు
- ప్రధాని మోదీ నిర్ణయంతో ముఖర్జీ కల సాకారమైంది
- బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్

జమ్మూ: జమ్మూకశ్మీర్ భారత్‌లో విడదీయరాని అంతర్భాగమని, ఆర్టికల్ 370, 35ఏ రద్దు ద్వారా ఆ రాష్ట్ర ప్రజలకు నిజమైన స్వేచ్ఛ లభించిందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ పేర్కొన్నారు. ఈ రాజ్యాంగ నిబంధనల రద్దుతో భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఆకాంక్షను ప్రధాని నరేంద్ర మోదీ సాకారం చేశారని అన్నారు. ముఖర్జీ 125వ జయంతి సందర్భంగా జమ్మూలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. 2019లో ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూకశ్మీర్‌లో అన్ని రంగాల్లో గణనీయమైన మార్పు కనిపిస్తోందని నబీన్ తెలిపారు. ఒకప్పుడు ఉద్రిక్త పరిస్థితులకు ప్రతీకగా నిలిచిన శ్రీనగర్‌లోని లాల్‌చౌక్ ఇప్పుడు జాతీయ సమైక్యతకు ప్రతీకగా మారిందని, అభివృద్ధి, శాంతి, పర్యాటక రంగాలు వేగంగా పురోగమిస్తున్నాయని చెప్పారు.

యువతకు కొత్త అవకాశాలు

కేంద్ర ప్రభుత్వ విధానాలతో జమ్మూకశ్మీర్ యువతకు కొత్త అవకాశాలు లభిస్తున్నాయని, గతంలో రాళ్ల రువ్వే ఘటనలతో వార్తల్లో నిలిచిన యువత నేడు క్రీడలు, ఇతర రంగాల్లో ప్రతిభ చాటుతూ దేశానికి గుర్తింపు తీసుకొస్తున్నారని పేర్కొన్నారు. ఉపాధి, మౌలిక సదుపాయాల అభివృద్ధి, శాంతిభద్రతల బలోపేతానికి కేంద్రం ప్రాధాన్యం ఇవ్వడంతో రాష్ట్రంలో సానుకూల మార్పులు చోటుచేసుకున్నాయని అన్నారు. జమ్మూకశ్మీర్‌కు 2019కు ముందు ఉన్న రాజ్యాంగ హోదాను పునరుద్ధరించే అవకాశమే లేదని నితిన్ నబీన్ స్పష్టం చేశారు. దేశ సమగ్రత, సుపరిపాలన, సమగ్రాభివృద్ధి లక్ష్యాలతో కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని, జమ్మూకశ్మీర్ అభివృద్ధికి, భద్రతకు, వారసత్వ పరిరక్షణకు పూర్తి కట్టుబాటుతో పనిచేస్తోందని ఆయన తెలిపారు.

370 రద్దుతో ముఖర్జీ కల నెరవేరింది

- శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి సందర్భంగా ప్రధాని మోదీ



కోల్‌కతా: జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించిన ఆర్టికల్ 370 రద్దు ద్వారా భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ కలను కేంద్ర ప్రభుత్వం సాకారం చేసిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. 'ఒక దేశం–ఒక రాజ్యాంగం–ఒక జెండా' అనే ముఖర్జీ సిద్ధాంతానికి 2019లో తీసుకున్న నిర్ణయంతో న్యాయం జరిగిందని పేర్కొన్నారు. ముఖర్జీ 125వ జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో వీడియో సందేశం ద్వారా ఆయన ప్రసంగించారు. శ్యామా ప్రసాద్ ముఖర్జీని దూరదృష్టి గల నాయకుడు, గొప్ప దేశభక్తుడు, జాతీయ సమైక్యతకు అంకితభావంతో పనిచేసిన మహనీయుడిగా మోదీ కొనియాడారు. జమ్మూకశ్మీర్ సంపూర్ణ విలీనమే ఆయన జీవిత లక్ష్యమని, ఆ ఆశయ సాధన కోసం జైలుకెళ్లి చివరకు ప్రాణత్యాగం చేశారని గుర్తు చేశారు. దేశ సమగ్రత కోసం ఆయన చేసిన త్యాగం తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని అన్నారు.

బీజేపీ భావజాలానికి ముఖర్జీయే పునాది

భారతీయ జనసంఘ్ స్థాపనతో దేశ రాజకీయాల్లో ప్రత్యామ్నాయ భావజాలానికి శ్యామా ప్రసాద్ ముఖర్జీ శ్రీకారం చుట్టారని ప్రధాని పేర్కొన్నారు. అదే భావజాలం నేడు భారతీయ జనతా పార్టీ రూపంలో దేశ సేవలో కొనసాగుతోందని చెప్పారు. నూతన భారత నిర్మాణంలో ముఖర్జీ సిద్ధాంతాలు మార్గదర్శకంగా నిలుస్తున్నాయని, బీజేపీ పాలనా విధానానికి అవే మూల స్ఫూర్తి అని వివరించారు. ముఖర్జీ వారసత్వాన్ని ఘనంగా స్మరించేందుకు కార్యక్రమాలు నిర్వహిస్తున్న పశ్చిమ బెంగాల్ బీజేపీ ప్రభుత్వాన్ని మోదీ అభినందించారు. జాతీయ నాయకులను గౌరవించడం 'నేషన్ ఫస్ట్' స్ఫూర్తితో పనిచేసే ప్రభుత్వాల బాధ్యత అని పేర్కొన్నారు. శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి వేడుకలను దేశవ్యాప్తంగా రెండేళ్లపాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బెంగాల్లో మూడు రాజ్యసభ స్థానాలకు నోటిఫికేషన్

24న ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ విడుదల

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ ఎంపీల రాజీనామాలతో మూడు రాజ్యసభ స్థానాలకు ఖాళీలు ఏర్పడ్డ సంగతి తెలిసిందే. ఎంపీలు సుఖేందు శేఖర్ రాయ్, సుస్మితా దేవ్, ప్రకాష్ చిక్ బారైక్ రాజీనామాలతో ఈ ఖాళీలు ఏర్పడ్డాయి. భారత ఎన్నికల సంఘం ఈ మూడు రాజ్యసభ స్థానాలకు సంబంధించి ఉప ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసింది. జులై 24వ తేదీన మూడు స్థానాలకు ఉప ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపింది. జూలై 7వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. నామినేషన్ల సమర్పణకు జూలై 14 ఆఖరి తేదీ అని పేర్కొంది. ఎన్నికల సంఘం మూడు ఖాళీలను విడివిడిగా పరిగణిస్తూ ప్రత్యేకంగా నోటిఫికేషన్లు జారీ చేసి, పోలింగ్ నిర్వహించనుంది. జులై 24వ తేదీన ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. బ్యాలెట్ పేపర్‌పై ఓటు వేయడానికి రిటర్నింగ్ అధికారి ఇచ్చే ప్రత్యేక ఊదా రంగు పెన్ను మాత్రమే వాడాలని, ఇతర పెన్నులు వాడితే ఓటు రద్దవుతుందని ఎన్నికల సంఘం తెలిపింది. ఇక, అదే రోజు సాయంత్రం 5 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభకానుంది. ఓట్ల లెక్కింపు పూర్‌ఖైన వెంటనే ఫలితాలు వెల్లడించనున్నారు.





ముంబై గజగజ

- మహారాష్ట్రను ముంచెత్తిన వానలు
- 24 గంటల్లో 600 మి.మీ. వర్షం
- ముంబై - పుణె రైలు మార్గం అస్తవ్యస్తం
- పట్టాల పునరుద్ధరణకు యుద్ధప్రాతిపదికన పనులు
- 27 రైళ్లు రద్దు, 57 దారి మళ్లింపు
- కర్జత్-లోనావాలా ఘాట్ సెక్షన్‌లో విరిగిపడ్డ కొండచరియలు


ముంబై: మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలు ముంబై–పుణె రైల్వే మార్గంపై తీవ్ర ప్రభావం చూపాయి. కర్జత్–లోనావాలా ఘాట్ సెక్షన్‌లో గత 24 గంటల్లో ఏకంగా 600 మి.మీ. వర్షపాతం నమోదు కావడంతో పలుచోట్ల కొండచరియలు విరిగిపడడంతో రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. అంతకుముందు రోజూ 300 మి.మీ. వర్షం కురిసినట్లు సెంట్రల్ రైల్వే అధికారులు తెలిపారు. ఆదివారం తొలి నాలుగు గంటల్లోనే 160 మి.మీ. వర్షం కురవడంతో ఠాకూర్‌వాడి సమీపంలోని భోర్‌ఘాట్‌లో మూడు రైల్వే పట్టాలపై, మంకీహిల్–ఖండాలా మధ్య కొండచరియలు విరిగిపడ్డాయి. ఖండాలా స్టేషన్ సమీపంలో చెట్టు కూలిపోవడంతో రాకపోకలకు మరింత అంతరాయం ఏర్పడింది. కొన్ని ప్రాంతాల్లో పట్టాలు దెబ్బతిన్న ప్పటికీ ఎడతెరిపి లేకుండా పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. దీంతో మొత్తం 27 రైళ్లను రద్దు చేశారు. మరో 57 రైళ్లను దారి మళ్లించగా.. 19 రైళ్లను మధ్యలోనే నిలిపివేశారు. 15 రైళ్ల మధ్యలోనే ప్రారంభమయ్యాయి. నాలుగు ఉప నగర రైళ్లతో పాటు మరికొన్ని రైళ్ల సమయాల్లో మార్పులు చేశారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రమాదకర ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా సిబ్బందిని మోహరించడంతో కొండచరియలు విరిగిపడిన సమాచారాన్ని ముందుగానే గుర్తించి రైళ్లను నిలిపివేశారు. దీంతో ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదని సెంట్రల్ రైల్వే వెల్లడించింది. పట్టాల పునరుద్ధరణ కోసం 200 మంది కార్మికులతో పనులు చేపట్టగా, మరో 200 మందిని అదనంగా రంగంలోకి దించారు. లోవ్జీ–డోలాప్లీ మధ్య వర్షాలతో బ్యాలస్ట్ కొట్టుకుపోవడంతో నిలిచిపోయిన కర్జత్–ఖోపోలీ రైలు సర్వీసులను సోమవారం సాయంత్రం పాక్షికంగా పునరుద్ధరించారు. పూర్తి స్థాయిలో రాకపోకలు ప్రారంభించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు.

మిస్సింగ్ లింక్ క్లియర్

భారీ వర్షాల కారణంగా భూస్థలనం చోటుచేసుకోవడంతో 18 గంటలకు పైగా నిలిచిపోయిన ముంబై–పుణె ఎక్స్‌ప్రెస్‌వే 'మిస్సింగ్ లింక్' మార్గంలో ముంబై వైపు రాకపోకలను సోమవారం రాత్రి పునరుద్ధరించారు. భద్రతా తనిఖీల అనంతరం రాత్రి 10.10 గంటల నుంచి రెండు లేన్లలో ట్రాఫిక్‌కు అనుమతి ఇచ్చినట్లు ఎంఎస్ఆర్‌డీసీ తెలిపింది. టన్నెల్–2 సమీపంలో కొండచరియలు విరిగిపడటంతో రాకపోకలను నిలిపివేయగా, సొరంగానికి ఎలాంటి నష్టం జరగలేదని అధికారులు వెల్లడించారు. శిథిలాల తొలగింపు, భద్రతా తనిఖీలు పూర్తయ్యాక ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. 13.3 కిలోమీటర్ల 'మిస్సింగ్ లింక్' మార్గం ద్వారా ముంబై–పుణె ప్రయాణ సమయం 20–30 నిమిషాలు తగ్గుతోంది.

నలుగురు మృతి.. ఇద్దరి గల్లంతు

మహారాష్ట్రలోని పుణె జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. మావల్ తాలూకాలోని పాటన్ గ్రామంలో విసాపూర్ కోట గోడలో భాగం కూలి ఇంటిపై పడటంతో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. పింప్రి–చించ్‌వాడ్‌లో గోడ కూలిన ఘటనలో మరో కార్మికుడు ప్రాణాలు కోల్పోగా, ఎనిమిది మంది గాయపడ్డారు. ఖేడ్ తాలూకాలో వరద ప్రవాహంలో కొట్టుకుపోయిన ఇద్దరి కోసం గాలింపు కొనసాగుతోంది. జిల్లాలో 22 ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడటంతో రహదారి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పరిస్థితి విషమించడంతో 568 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మావల్‌లో అత్యధికంగా 237.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. భారత వాతావరణ శాఖ జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేయడంతో జూలై 7న జున్నార్, ఖేడ్, అంబేగావ్, రాజ్‌గఢ్, భోర్, మావల్, ముల్షీ తాలూకాల్లో పాఠశాలలకు సెలవు ప్రకటించారు.



ఒడిశాను ముంచెత్తిన వర్షాలు

- ఇల్లు కూలి రెండేళ్ల చిన్నారి మృతి

భువనేశ్వర్/సంబల్‌పూర్/బారిపద: అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షాలు ఒడిశాలో జనజీవనాన్ని అస్తవ్యస్తం చేశాయి. మయూర్‌భంజ్ జిల్లాలో ఇల్లు గోడ కూలి రెండేళ్ల చిన్నారి మృతి చెందగా, పలుచోట్ల నీరు ఇళ్లలోకి చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బైతరణి నదిలో నీటిమట్టం ప్రమాదస్థాయికి చేరువ కావడంతో జాజ్‌పూర్, భద్రక్ జిల్లాల లోతట్టు ప్రాంతాలకు వరద హెచ్చరికలు జారీ చేశారు. మయూర్‌భంజ్ జిల్లా ఠాకూర్‌ముండా ప్రాంతంలో శిథిలావస్థలో ఉన్న ఇంటి గోడ కూలిపోవడంతో రెండేళ్ల చాందినీ ముండా మృతి చెందింది. మరోవైపు సంబల్‌పూర్ సమీపంలోని డ్రెయినేజీ కాలువను బైక్‌పై దాటే ప్రయత్నంలో ఇద్దరు వ్యక్తులు వరద ప్రవాహంలో చిక్కుకోగా, ఒకరు ప్రాణాలతో బయటపడగా సురేష్ మహరాణా అనే వ్యక్తి గల్లంతయ్యాడు. భారీ వర్షాలతో సంబల్‌పూర్, భువనేశ్వర్, కటక్ సహా పలు పట్టణాల్లో లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. అనేక ఇళ్లలోకి వరదనీరు చేరడంతో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ప్రభావితుల కోసం తాత్కాలిక శిబిరాలు, ఉచిత ఆహార పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

బైతరణికి వరద హెచ్చరిక

బైతరణి నది ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవడంతో వచ్చే 24 గంటల్లో స్వల్ప నుంచి మోస్తరు వరదలు వచ్చే అవకాశం ఉందని జలవనరుల శాఖ హెచ్చరించింది. అకువాపాడ వద్ద నది ప్రమాదస్థాయిని దాటే అవకాశముందని అధికారులు తెలిపారు. అయితే వర్షం క్రమంగా తగ్గుముఖం పట్టడంతో పరిస్థితి అదుపులోకి వచ్చే అవకాశం ఉందని ప్రభుత్వం పేర్కొంది. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అన్ని జిల్లాల కలెక్టర్లను అప్రమత్తం చేశారు. ప్రమాదకర ప్రాంతాల్లో పడవలు, సహాయక బృందాలు, పాలిథిన్ షీట్లు, మందులు, పొడి ఆహారాన్ని సిద్ధంగా ఉంచారు. భారీ వర్షాల కారణంగా కటక్, సంబల్‌పూర్, బర్గఢ్, సోన్‌పూర్, కంధమాల్ తదితర జిల్లాల్లో సోమవారం విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు.

రామాలయ ట్రస్టులో కీలక మార్పులు



- చంపత్‌రాయ్ రాజీనామా ఆమోదం
- తాత్కాలిక ప్రధాన కార్యదర్శిగా కృష్ణమోహన్
- విరాళాల వ్యవస్థ ప్రక్షాళనకు నిర్ణయం
- సీఈవో నియామకానికి ముగ్గురు సభ్యులతో కమిటీ
- సిట్ తుది నివేదికపై జులై 22న మరోసారి ట్రస్టు సమావేశం

అయోధ్య: రామాలయ విరాళాల దుర్వినియోగం వివాదం నేపథ్యంలో శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు సోమవారం కీలక నిర్ణయాలు తీసుకుంది. ట్రస్టు ప్రధాన కార్యదర్శి చంపత్‌రాయ్, ట్రస్టు సభ్యుడు అనిల్ మిశ్రా రాజీనామాలను ఆమోదించిన ట్రస్టు, ట్రస్టీ కృష్ణమోహన్‌ను తాత్కాలిక ప్రధాన కార్యదర్శిగా నియమించింది. అలాగే ఆలయ పరిపాలనను మరింత పారదర్శకంగా నిర్వహించేం దుకు ముఖ్య కార్యనిర్వాహక అధికారి (సీఈవో) నియామకానికి ముగ్గురు సభ్యులతో కూడిన అన్వేషణ కమిటీని ఏర్పాటు చేసింది. ట్రస్టు కోశాధికారి గోవింద్ గిరి మాట్లాడుతూ, విరాళాల నిర్వహణ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేస్తామని తెలిపారు. సిట్ సూచనలను అమలు చేయడంతో పాటు నిపుణుల సలహాలతో భద్రత, పర్యవేక్షణ, పరిపాలనా విధానాలను మరింత పటిష్ఠం చేస్తామని చెప్పారు. దర్యాప్తు పూర్తయ్యే వరకు పదవిలో కొనసాగడం సముచితం కాదనే ఉద్దేశంతోనే చంపత్‌రాయ్ స్వచ్ఛందంగా రాజీనామా చేశారని వెల్లడించారు.

విలువైన కానుకలన్నీ భద్రం

భక్తులు సమర్పించిన బంగారం, వెండి ఆభరణాలు, ఇతర విలువైన కానుకలు సహా నగదేతరంగా అందిన మొత్తం 2,926 కానుకలు సురక్షితంగా ఉన్నాయని ట్రస్టు స్పష్టం చేసింది. ప్రతి కానుకను రికార్డుల్లో నమోదు చేసి, ప్రతి ఏడాది స్వతంత్ర చార్టర్డ్ అకౌంటెంట్లతో భౌతిక ధృవీకరణ నిర్వహిస్తున్నట్లు తెలిపింది. విలువైన వస్తువులు మాయమయ్యాయన్న ఆరోపణలు నిరాధారమని పేర్కొంది. విరాళాల దుర్వినియోగంపై దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తుది నివేదికను జులై 22 నాటికి అందజేసే అవకాశం ఉందని ట్రస్టు తెలిపింది. అదే రోజు జరిగే తదుపరి సమావేశంలో నివేదికపై చర్చించి, అవసరమైన తదుపరి చర్యలు, కొత్త ట్రస్టీల నియామకాలపై నిర్ణయం తీసుకోనున్నట్లు వెల్లడించింది. ఇప్పటివరకు ఈ కేసులో విరాళాల లెక్కింపుతో సంబంధం ఉన్న ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేయగా, ట్రస్టీల పేర్లు ఎఫ్ఐఆర్‌లో లేవని ట్రస్టు పేర్కొంది.

బంధుమిత్రులకే రామాలయ విరాళాల సొమ్ము!

- విచారణలో కీలక విషయాలు వెల్లడించిన నిందితుడు అవినాష్
- కుటుంబ సభ్యులు, స్నేహితుల కోసం రూ.19 లక్షల ఖర్చు
- నగదు, బంగారం, వెండి ఆభరణాలు, కారు స్వాధీనం
- నిధుల రికవరీకి చర్యలు
- సోదరుల ఖాతాలు, భూముల కొనుగోళ్లపై దర్యాప్తు ముమ్మరం

అయోధ్య రామాలయ విరాళాల నిధుల దుర్వినియోగం కేసులో నిందితుడు అవి నాష్ శుక్లా విచారణలో కీలక విషయాలు వెల్లడించినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. విరాళాల సొమ్ములో రూ.19 లక్షలను కుటుంబ సభ్యులు, స్నేహితుల కోసం ఖర్చు చేసినట్లు అతడు అంగీకరించినట్లు సమాచారం. విచారణ లో భాగంగా ఒక సోదరుడి వివాహానికి రూ.6 లక్షలు, మరో సోదరుడికి రూ.5 లక్షలు ఇచ్చినట్లు అవినాష్ వెల్లడించినట్లు తెలిసింది. సుమారు రూ.3.5 లక్షల విలువైన కారును కొనుగోలు చేయగా, దానిని పోలీసులు ఇప్పటికే స్వాధీనం చేసుకున్నారు. ఓ స్నేహితుడికి రూ.2.5 లక్షలు బదిలీ చేయడంతో పాటు ఖరీదైన మొబైల్ ఫోన్‌ను కూడా బహుమతిగా ఇచ్చినట్లు దర్యాప్తులో తేలింది. మరికొందరికి కూడా చిన్న మొత్తాల్లో నగదు పంపిణీ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసులో అవినాష్‌కు చెందిన ఇద్దరు సోదరు లను పోలీసులు విచారించగా, దర్యాప్తుకు సంబంధించిన పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. 2024లో అతని సోదరుడు అభిషేక్ శుక్లా పేరిట కొనుగోలు చేసిన భూములతో పాటు నిధులు జమ అయినట్లు అనుమానిస్తున్న బ్యాంకు ఖాతాలను కూడా అధికారులు పరిశీలిస్తున్నారు. దారి మళ్లించిన నిధులను తిరిగి రాబట్టేందుకు చట్టపరమైన చర్యలు ప్రారంభించారు. ఇప్పటికే అవినాష్ శుక్లా వద్ద నుంచి రూ.20.39 లక్షల నగదు, 1,121 అమెరికన్ డాలర్లు, బంగారు, వెండి ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులతో పాటు ఒక కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

సీసీటీవీల్లో అక్రమాలు

రామాలయ విరాళాల దొంగతనం, నిధుల దుర్వినియోగం కేసులో సిట్ ప్రాథమిక నివేదిక సంచలన విషయాలను వెలుగులోకి తెచ్చింది. విరాళాల లెక్కింపు సమయంలో కొందరు ఉద్యోగులు నోట్ల కట్టలను బట్టలు, జేబులు, చెప్పుల్లో దాచిన ఘటనలు సీసీటీవీ దృశ్యాల్లో నమోదైనట్లు గుర్తించింది. ఏప్రిల్ 27 నుంచి జూన్ 5 మధ్య సుమారు 70 అనుమానాస్పద ఘటనలు చోటుచేసుకున్నాయని, భద్రతా తనిఖీలు, సీసీటీవీ పర్యవేక్షణ, విరాళాల లెక్కింపులో తీవ్ర లోపాలు ఉన్నట్లు పేర్కొంది. అవినాష్ శుక్లా సహా ఆరుగురి ప్రమేయానికి ప్రాథమిక ఆధారాలు లభించగా, వీరితో పాటు మరో ఇద్దరు ఇప్పటికే అరెస్టయ్యారు. కొందరు ఉద్యోగుల వద్ద నుంచి రూ.78.94 లక్షలు, లెక్కింపు కేంద్రం నుంచి రూ.2.25 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సిట్ వెల్లడించింది. ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లో అనుమానాస్పద లావాదేవీలపై దర్యాప్తు కొనసాగుతోందని, తుది నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపింది.

రెడ్‌కార్డు నిర్ణయం దారుణం

- బాలొగున్‌పై నిషేధం ఎత్తివేయాలని సమీక్ష మాత్రమే కోరా
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్

వాషింగ్టన్: ఫిఫా ప్రపంచకప్‌లో అమెరికా స్టార్ ఫార్వర్డ్ ఫోలారిన్ బాలొగున్‌కు చూపిన రెడ్‌కార్డు నిర్ణయం దారుణమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. అయితే శిక్షను రద్దు చేయాలని తాను ఆదేశించలేదని, కేవలం నిర్ణయాన్ని మరోసారి సమీక్షించాలని మాత్రమే ఫిఫా అధ్యక్షుడు జియానీ ఇన్‌ఫాంటినోను కోరానని స్పష్టం చేశారు. తుది నిర్ణయం పూర్తిగా ఫిఫా స్వతంత్ర కమిటీదేనని తెలిపారు. బోస్నియా–హెర్జెగొవినాపై అమెరికా 2–0తో గెలిచిన మ్యాచ్‌లో బాలొగున్‌కు రెడ్‌కార్డు విధించడంతో ఒక మ్యాచ్ నిషేధం పడింది. దీంతో బెల్జియంతో జరిగిన ప్రీక్వార్టర్ మ్యాచ్‌కు అతడు దూరమయ్యే పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో తాను ఇన్‌ఫాంటినోతో మాట్లాడి కేసును పునఃసమీక్షించాలని మాత్రమే కోరానని ట్రంప్ చెప్పారు. అనంతరం ఫిఫా నిషేధాన్ని తాత్కాలికంగా ఎత్తివేయ డంతో బాలొగున్ బెల్జియంపై బరిలోకి దిగాడు. ట్రంప్ వ్యాఖ్యల అనంతరం ఫిఫా అధ్యక్షుడు ఇన్‌ఫాం టినో స్పందించారు. ట్రంప్‌తో మాట్లాడినప్పుడు కేసు స్వతంత్ర న్యాయ ప్రక్రియలో ఉందని, ఫిఫా క్రమశిక్షణ కమిటీ నిబంధనల ప్రకారమే నిర్ణయం తీసుకుందని వివరించినట్లు తెలిపారు. ఫిఫా వ్యవస్థ స్వతంత్రతను ఎప్పటికీ కాపాడతామని స్పష్టం చేశారు.

వివాదానికి దారితీసిన నిర్ణయం

బోస్నియా డిఫెండర్ తారిక్ ముహరెమోవిచ్‌పై చేసిన టాకిల్‌కు మొదట రిఫరీ ఎలాంటి కార్డు చూపలేదు. అనంతరం వీడియో సమీక్ష (వీఏఆర్) తర్వాత రెడ్ కార్డు విధించారు. వీడియోను నెమ్మదిగా చూపించడం వల్ల ఘటన మరింత తీవ్రంగా కనిపించిందని ట్రంప్ అభిప్రాయపడ్డారు. అయితే ఫిఫా నిర్ణయంపై బెల్జియం ఫుట్‌బాల్ సమాఖ్య అభ్యంతరం వ్యక్తం చేయగా, యూఈఎఫ్ఏ కూడా దీనిని అర్థంకాని, సమర్థించలేని నిర్ణయంగా విమర్శించింది.

వైట్‌హౌస్‌లో గ్రానైట్ హెలిప్యాడ్ నిర్మాణం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైట్‌హౌస్ దక్షిణ లాన్‌లో గ్రానైట్‌తో శాశ్వత హెలిప్యాడ్ నిర్మిస్తున్నట్లు ప్రకటించారు. కొత్త తరం 'మెరైన్ వన్' అధ్యక్ష హెలికాప్టర్లు నేరుగా కిందకు వెలువడటంతో వైట్‌హౌస్ లాన్ దెబ్బతింటోందని ట్రంప్ పేర్కొన్నారు. హెలి ప్యాడ్ నిర్మాణం పూర్తయితే దశాబ్దాలుగా విని యోగిస్తున్న పాత అధ్యక్ష హెలికాప్టర్లను పూర్తిగా విరమించుకునే అవకాశం ఉంటుందని అన్నారు. వైట్‌హౌస్‌లో రోజ్ గార్డెన్ పునర్నిర్మాణం, కొత్త జెండా స్తంభాల ఏర్పాటు, బాల్‌రూమ్ నిర్మాణం, భవనం ఉత్తర భాగంలోని స్తంభాల పునరుద్ధరణ వంటి పలు అభివృద్ధి పనులు కూడా కొనసాగు తున్నాయని ట్రంప్ తెలిపారు. వైట్‌హౌస్‌కు మరింత అందం, ఆధునిక సౌకర్యాలు కల్పించడమే తమ లక్ష్యమని చెప్పారు.

కొత్త హెలికాప్టర్ల కోసం

2024లో సికోర్స్కీ సంస్థ రూపొందించిన కొత్త వీహెచ్–92ఏ అధ్యక్ష హెలికాప్టర్ల వేడి గాలి నేరుగా కిందకు వెలువడటంతో వైట్‌హౌస్ లాన్ దెబ్బతింటోందని ట్రంప్ పేర్కొన్నారు. హెలి ప్యాడ్ నిర్మాణం పూర్తయితే దశాబ్దాలుగా విని యోగిస్తున్న పాత అధ్యక్ష హెలికాప్టర్లను పూర్తిగా విరమించుకునే అవకాశం ఉంటుందని అన్నారు. వైట్‌హౌస్‌లో రోజ్ గార్డెన్ పునర్నిర్మాణం, కొత్త జెండా స్తంభాల ఏర్పాటు, బాల్‌రూమ్ నిర్మాణం, భవనం ఉత్తర భాగంలోని స్తంభాల పునరుద్ధరణ వంటి పలు అభివృద్ధి పనులు కూడా కొనసాగు తున్నాయని ట్రంప్ తెలిపారు. వైట్‌హౌస్‌కు మరింత అందం, ఆధునిక సౌకర్యాలు కల్పించడమే తమ లక్ష్యమని చెప్పారు.

సంజూ ఔట్!

- జింబాబ్వేతో టీ20 సిరీస్‌కు జట్టును ఎంపిక చేసిన సెలక్టర్లు
- తొలిసారి యశ్ ఠాకూర్, అశోక్ శర్మలకు చోటు
- హర్ష్ దూబేకు పిలుపు.. వికెట్ కీపర్‌గా ప్రభ్‌సిమ్రన్ సింగ్

న్యూఢిల్లీ: భారత క్రికెట్ భవిష్యత్ జట్టును తీర్చిదిద్దే దిశగా సెలెక్టర్లు మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రపంచకప్ విజేత జట్టులో సభ్యుడైన వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్‌కు జింబాబ్వే పర్యటనకు ఎంపిక చేసిన టీ20 జట్టులో చోటు దక్కలేదు. యువ ఆటగాళ్లకు అవకాశాలు కల్పించే వ్యూహంలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. జింబాబ్వేతో భారత్ మూడు టీ20 మ్యాచ్‌లు ఆడనుంది. జూలై 23, 25, 27 తేదీల్లో హరారే వేదికగా ఈ పోటీలు జరగనున్నాయి. ఈ సిరీస్‌కు శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా వ్యవహరించనుండగా, తిలక్ వర్మ వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. ఐపీఎల్-2026లో గుజరాత్ టైటాన్స్ తరఫున ఆకట్టుకున్న పేసర్లు యశ్ ఠాకూర్, అశోక్ శర్మలకు తొలిసారి భారత టీ20 జట్టులో స్థానం లభించింది. ఇటీవల అఫ్గానిస్థాన్‌తో వన్డే అరంగేట్రం చేసిన ఎడమచేతి స్పిన్నర్ హర్ష్ దూబే కూడా తొలిసారి టీ20 జట్టులోకి వచ్చాడు. యువ బౌలర్లకు అంతర్జాతీయస్థాయిలో అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతోనే ఈ ఎంపికలు చేసినట్లు బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి.

ప్రభ్‌సిమ్రన్ చోటు

శాంసన్ స్థానాన్ని పంజాబ్ కింగ్స్ వికెట్ కీపర్ బ్యాటర్ ప్రభ్ సిమ్రన్ సింగ్ భర్తీ చేశాడు. ఐపీఎల్-2026లో నిలకడైన ప్రదర్శన చేసిన ప్రభ్‌సిమ్రన్‌కు జాతీయ జట్టులో మరో అవకాశం దక్కింది. ఇటీవల టీ20ల్లో శాంసన్ ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. ఐర్లాండ్‌తో జరిగిన రెండు మ్యాచ్‌లు, ఇంగ్లం డ్‌తో డర్హమ్‌లో జరిగిన తొలి టీ 20లో విఫలమవడం అతడి ఎంపికపై ప్రభావం చూపినట్లు తెలుస్తోంది. ఇదిలాఉంటే యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి జింబాబ్వే సిరీస్‌లోనూ అవకాశం కల్పించారు. ఇంగ్లండ్‌తో జరిగిన రెండో టీ20లో అంత ర్జాతీయ అరంగేట్రం చేసిన వైభవ్, భార త్ తరఫున ఆడిన అత్యంత పిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించి న విషయం తెలిసిందే.



మయాంక్, రింకూ తిరిగి జట్టులోకి

గాయం కారణంగా కొంతకాలం దూరమైన పేసర్ మయాంక్ యాదవ్ టీ 20 జట్టులోకి పునరాగమనం చేశాడు. బ్యాటర్ రింకూ సింగ్‌కు కూడా చో టు లభించింది. అయితే ప్రసిద్ధ్ కృ ష్ణ, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్ లకు విశ్రాంతి ఇచ్చారు.

భారత టీ20 జట్టు: శ్రేయస్ అ య్యర్ (కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ (వైస్ కె ప్టెన్), ఇషాన్ కిషన్, శివమ్ దూబే, సూర్యాంశ్ షెడ్గే, రింకూ సింగ్, హర్ష్ దూబే, వరుణ్ చక్రవర్తి, ప్రిన్స్ యాదవ్, యశ్ ఠాకూర్, అశోక్ శర్మ, మయాంక్ యాదవ్, ప్రభ్‌సిమ్రన్ సింగ్.

ముగిసిన ఈలా ప్రయాణం

- ఫిలిప్పీన్స్ యువ సంచలనంపై 6-4, 4-6, 6-3 తేడాతో పావోలినీ విజయం



లండన్: ప్రతిష్ఠాత్మక వింబుల్డన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో ఇటలీ స్టార్ జాస్మిన్ పావోలినీ క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. ఫిలిప్పీన్స్ యువ సంచలనం అలెగ్జాండ్రా ఈలా చారిత్రక ప్రస్థానానికి పావోలినీ ముగింపు పలికింది. సోమవారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రీ-క్వార్టర్ ఫైనల్లో 13వ సీడ్ పావోలినీ 6-4, 4-6, 6-3 తేడాతో ఈలాను ఓడించింది. సెంటర్ కోర్టులో జరిగిన ఈ మ్యాచ్‌ను ఎనిమిది సార్లు వింబుల్డన్ పురుషుల సింగిల్స్ విజేత రోజర్ ఫెదరర్ రాయల్ బాక్స్ నుంచి వీక్షించారు. తన అభిమాన ఆటగాడు ఫెదరర్ చూస్తుండటంతో తొలుత ఉత్కంఠకు గురైనప్పటికీ, ఆటపై దృష్టి పెట్టి విజయం సాధించానని పావోలినీ పేర్కొంది. 'ఆయన నా ఆరాధ్య ఆటగాడు. మ్యాచ్ సమయంలో ఏకాగ్రత కోల్పోకుండా ఉండేందుకు ప్రయత్నించాను' అని తెలిపింది.

ఈలాకు చారిత్రక ముగింపు

21 ఏళ్ల ఈలా వింబుల్డన్‌లో అద్భుత ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షించింది. మూడో రౌండ్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఇగా స్వియాటెక్‌ను ఓడించి సంచలనం సృష్టించిన ఆమె, గ్రాండ్‌స్లామ్ సింగిల్స్‌లో ఓపెన్ ఎరాలో ఇంత దూరం వచ్చిన తొలి ఫిలిప్పీన్స్ క్రీడాకారిణిగా రికార్డు సృష్టించింది. క్వార్టర్ ఫైనల్లో పావోలినీకి ఉక్రెయిన్ క్రీడాకారిణి మార్టా కోస్యూక్ ఎదురుకానుంది. 12వ సీడ్ కోస్యూక్ క్వాలిఫయర్ అష్లిన్ క్రూగర్‌ను 6-4, 6-4తో ఓడించి తొలిసారి వింబుల్డన్ క్వార్టర్ ఫైనల్లోకి అడుగుపెట్టింది.

కోబొల్లి సంచలనం

పురుషుల సింగిల్స్‌లో ఇటలీ ఆటగాడు ఫ్లావియో కోబొల్లి సంచలనం సృష్టించాడు. 9వ సీడ్ కోబొల్లి, 5వ సీడ్ ఆస్ట్రేలియా ఆటగాడు అలెక్స్ డి మినార్‌ను 7-5, 7-6 (4), 6-3తో ఓడించి ముందంజ వేశాడు. సోమవారం లండన్‌లో ఉష్ణోగ్రతలు 31 డిగ్రీల సెల్సియస్‌కు చేరడంతో ఆటగాళ్లు తీవ్ర వేడిని ఎదుర్కొన్నారు. విరామ సమయాల్లో పలువురు క్రీడాకారులు మెడ చుట్టూ ఐస్ టవల్స్ వేసుకుని ఉపశమనం పొందారు. కాగా, వింబుల్డన్‌లో మిగిలిన క్వార్టర్ ఫైనల్ బెర్తుల కోసం గ్రిగర్ దిమిత్రోవ్, ఆర్థర్ ఫెరీ, అలెగ్జాండర్ జ్వెరెవ్, జిరి లెహెక్కా, టేలర్ ఫ్రిట్జ్, అలెగ్జాండర్ బుబ్లిక్ పోటీ పడుతున్నారు.

రొనాల్డో ఖేల్ ఖతం!



- క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లిన స్పెయిన్
- చివరి నిమిషంలో మెరినో గోల్
- పోర్చుగల్‌పై 1-0 తేడాతో ఘన విజయం

ఆర్లింగ్టన్: ఫిఫా ప్రపంచకప్‌లో పోర్చుగల్ స్టార్ క్రిస్టియానో రొనాల్డో ప్రస్థానానికి తెరపడింది. ఉత్కంఠభరితంగా సాగిన ప్రీక్వార్టర్ ఫైనల్లో స్పెయిన్ 1-0తో పోర్చుగల్‌ను ఓడించి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. చివరి క్షణాల్లో స్పెయిన్ మిడ్‌ఫీల్డర్ మికెల్ మెరినో చేసిన గోల్ మ్యాచ్ ఫలితాన్ని మార్చేసింది. దీంతో ప్రపంచకప్ వేదికపై రొనాల్డో మరోసారి పోర్చుగల్‌ను ముందుకు తీసుకెళ్లాలన్న ఆశలు ఆవిరయ్యాయి. హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో నిర్ణీత సమయం ముగిసే వరకు ఇరు జట్లు గోల్ చేయలేకపోయాయి. రెండో అర్ధభాగం అదనపు సమయంలో మెరినో ఫౌల్‌కు గురికావడంతో స్పెయిన్‌కు ఫ్రీకిక్ లభించింది. ఫౌల్‌పై పోర్చుగల్ ఆటగాళ్లు రిఫరీతో వాదనలో ఉండగా, మెరినో వెంటనే ఆటను ప్రారంభించాడు. ఫెరాన్ టోరెస్ అందించిన పాస్‌ను అందుకున్న మెరినో అద్భుతమైన షాట్‌తో బంతిని గోల్‌పోస్ట్‌లోకి పంపాడు. గోల్ కీపర్ డియోగో కోస్టాకు ఏమాత్రం అవకాశం ఇవ్వని ఆ ప్రయత్నం స్పెయిన్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించింది.

రొనాల్డోకు చివరి ప్రపంచకప్ మ్యాచ్

ఈ ఓటమితో క్రిస్టియానో రొనాల్డో ప్రపంచకప్ కెరీర్ ముగిసింది. అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో అత్యధిక గోల్స్ సాధించిన ఆటగాడిగా చరిత్ర సృష్టించిన రొనాల్డో.. తన చివరి ప్రపంచకప్‌లో పోర్చుగల్‌ను ముందుకు నడిపించాలని ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. వరుసగా రెండో ప్రపంచకప్‌లో పోర్చుగల్‌ను క్వార్టర్ ఫైనల్‌కు చేర్చాలన్న అతడి లక్ష్యం నెరవేరలేదు. ఇదిలాఉంటే 2010లో దక్షిణాఫ్రికాలో ప్రపంచకప్ టైటిల్ సాధించిన తర్వాత స్పెయిన్ తొలిసారి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది.

న్యూజిలాండ్‌కు భారత్ ఏ జట్టు

- ప్రధాన జట్టు సిరీస్‌కు ముందు మూడు లిస్ట్-ఏ, రెండు ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు
- ఆటగాళ్ల సన్నద్ధతకు కీలక అవకాశం

న్యూఢిల్లీ: న్యూజిలాండ్‌లో సీనియర్ జట్టు బహుళ ఫార్మాట్ సిరీస్‌కు ముందు భారత 'ఏ' జట్టు పర్యటనకు సిద్ధమవుతోంది. న్యూజిలాండ్ గడ్డపై జరిగే ఈ పర్యటనలో భాగంగా భారత్ 'ఏ' జట్టు మూడు లిస్ట్-ఏ (50 ఓవర్ల) మ్యాచ్‌లు, రెండు ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడనుంది. ప్రధాన జట్టులో చోటు కోసం ఎదురుచూస్తున్న ఆటగాళ్లకు విదేశీ పరిస్థితుల్లో తమ ప్రతిభను నిరూపించుకునేందుకు ఈ పర్యటన కీలకంగా మారనుంది. న్యూజిలాండ్ వాతావరణం, మైదాన పరిస్థితులకు అలవాటు పడేందుకు జాతీయ టెస్టు జట్టులోని కొందరు ఆటగాళ్లను కూడా భారత్ 'ఏ' జట్టుతో పంపించే అవకాశాలు ఉన్నాయి. ఎర్ర బంతి, తెల్ల బంతి క్రికెట్‌లో ఆటగాళ్ల సామర్థ్యాన్ని అంచనా వేయడంతో పాటు, విదేశీ పిచ్‌లపై వారి సన్నద్ధతను పరిశీలించేందుకు ఈ పర్యటనను ఉపయోగించుకోనున్నారు. భారత్ 'ఏ' జట్టు పర్యటనలో తొలుత మూడు 50 ఓవర్ల లిస్ట్-ఏ మ్యాచ్‌లు జరగనున్నాయి. అనంతరం రెండు ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. న్యూజిలాండ్ పరిస్థితుల్లో ఆటగాళ్లకు విలువైన మ్యాచ్ అనుభవం కల్పించడమే ఈ షెడ్యూల్ ఉద్దేశం.

శ్రీలంకకు భారత టెస్టు జట్టు

మరోవైపు శ్రీలంక పర్యటనకు వెళ్లనున్న భారత టెస్టు జట్టు ఆగస్టు 4 లేదా 5 తేదీల్లో బయలుదేరే అవకాశం ఉంది. సిరీస్‌కు ముందు సన్నాహక చర్యల్లో భాగంగా ఆగస్టు 8 నుంచి శ్రీలంక బోర్డు ప్రెసిడెంట్స్ ఎలెవన్‌తో వార్మప్ మ్యాచ్ ఆడనుంది. అనంతరం ఆగస్టు 15 నుంచి రెండు టెస్టుల సిరీస్ ప్రారంభం కానుంది. స్థానిక పరిస్థితులకు ఆటగాళ్లు త్వరగా అలవాటు పడేందుకు ఈ సన్నాహక మ్యాచ్ దోహదపడుతుందని జట్టు వర్గాలు భావిస్తున్నాయి.

ఆధిక్యంలోనే అభిజీత్

- పుణె అంతర్జాతీయ గ్రాండ్‌మాస్టర్ చెస్‌లో టాపర్‌గా కొనసాగింపు

పుణె: పుణె అంతర్జాతీయ గ్రాండ్‌మాస్టర్ రౌండ్ రాబిన్ చెస్ టోర్నమెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ అభిజీత్ గుప్తా తన జోరును కొనసాగిస్తున్నాడు. ఏడో రౌండ్‌లో అంతర్జాతీయ మాస్టర్ అక్షయ్ బోర్గాంకర్‌తో జరిగిన మ్యాచ్‌ను డ్రాగా ముగించిన అభిజీత్.. మొత్తం 5.5 పాయింట్లతో అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. భారత ఆటగాడు ఐఎం అశ్వత్ ఎస్ అద్భుత ఫామ్‌ను కొనసాగించాడు. బెలారస్‌కు చెందిన గ్రాండ్‌మాస్టర్ అలెక్సీ అలెగ్జాండ్రోవ్‌ను ఓడించి 5 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచాడు. మరో భారత ఆటగాడు ఐఎం కుషాగ్ర మోహన్ కూడా కీలక విజయం సాధించాడు. బెలారస్ గ్రాండ్‌మాస్టర్ ఫెడొరోవ్ అలెక్సీపై గెలిచి 5 పాయింట్లతో మూడో స్థానానికి చేరుకున్నాడు. భారత ఆటగాడు అడ్విక్ అగర్వాల్ ఏడో రౌండ్‌లో ఆకట్టుకున్నాడు.



Business బిజినెస్

నాలుగో రోజూ దూసుకెళ్లిన మార్కెట్లు

- 521 పాయింట్లు ఎగిసిన సెన్సెక్స్.. రెండు నెలల గరిష్ఠ ముగింపు
- బ్యాంకింగ్, చమురు షేర్లకు భారీ కొనుగోళ్లు
- చమురు ధరల తగ్గుదలతో పెట్టుబడిదారుల్లో జోష్
- 24,430 పాయింట్ల వద్ద ముగిసిన నిఫ్టీ



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా నాలుగో ట్రేడింగ్ సెషన్‌లోనూ లాభాలతో ముగిశాయి. బ్యాంకింగ్, చమురు రంగ షేర్లలో కొనుగోళ్లు పెరగడం, అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు తగ్గుముఖం పట్టడం, విదేశీ సంస్థాగత పెట్టుబడుల (ఎఫ్ఐఐలు) ప్రవాహం కొనసాగడం వంటి అంశాలు మార్కెట్లకు ఊతమిచ్చాయి. ఫలితంగా బీఎస్ఈ సెన్సెక్స్ 521.16 పాయింట్లు (0.67 శాతం) ఎగిసి 78,285.07 పాయింట్ల వద్ద ముగిసింది. ఇది ఏప్రిల్ 22 తర్వాత నమోదైన అత్యధిక ముగింపు. ట్రేడింగ్ మధ్యలో సెన్సెక్స్ 634 పాయింట్లకుపైగా లాభపడి 78,398.06 వద్ద గరిష్ఠాన్ని తాకింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 159.50 పాయింట్లు (0.66 శాతం) పెరిగి 24,430.35 వద్ద ముగిసింది. ఏప్రిల్ 21 తర్వాత ఇదే అత్యధిక ముగింపు. గత నాలుగు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ మొత్తం 1,806.40 పాయింట్లు (2.36 శాతం), నిఫ్టీ 564.60 పాయింట్లు (2.36 శాతం) లాభపడడం విశేషం.

బ్యాంకింగ్, చమురు షేర్లకు డిమాండ్

సెన్సెక్స్‌లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు అత్యధికంగా 3.59 శాతం లాభపడింది. మహీంద్రా అండ్ మహీంద్రా, భారత్ ఎలక్ట్రానిక్స్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంక్, మారుతి షేర్లు కూడా కొనుగోళ్లతో మెరిశాయి. మరోవైపు కోటక్ మహీంద్రా బ్యాంక్, టీసీఎస్, బజాజ్ ఫిన్‌సర్వ్, పవర్‌గ్రిడ్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ ధర 0.82 శాతం తగ్గి బ్యారెల్‌కు 71.53 డాలర్లకు చేరింది. ముడిచమురు ధరలు తగ్గడం వల్ల ద్రవ్యోల్బణం, ప్రస్తుత ఖాతా లోటు, చమురు మార్కెటింగ్ కంపెనీల లాభదాయకత, దేశ ఆర్థిక స్థిరత్వానికి మేలు జరుగుతుందని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడ్డారు.

సహకార రంగంలో మరో విప్లవం

- త్వరలో సహకార జీవ బీమా సంస్థ ఏర్పాటు
- రెండేళ్లలో భారత్ ట్యాక్సీ సేవల విస్తరణ
- పారదర్శక పాలన, కొత్త వ్యాపారాలతో వ్యవస్థను మరింత బలోపేతం చేస్తాం
- కేంద్ర హోం, సహకార శాఖల మంత్రి అమిత్ షా

న్యూఢిల్లీ: దేశంలోని సహకార రంగాన్ని ఆధునికీకరించి మరింత విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేయనుంది. సహకార రంగంలో ప్రత్యేక జీవ బీమా సంస్థను ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర హోంమంత్రి, సహకార శాఖ మంత్రి అమిత్ షా ప్రకటించారు. అలాగే సహకార నమూనాలో ప్రారంభమైన భారత్ ట్యాక్సీ సేవలను వచ్చే రెండేళ్లలో దేశవ్యాప్తంగా 500 నగరాలకు విస్తరించనున్నట్లు వెల్లడించారు. సహకార మంత్రిత్వశాఖ ఏర్పాటు ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఈ ప్రకటనలు చేశారు. దేశంలో ప్రస్తుతం 8.5 లక్షలకు పైగా సహకార సంఘాలు, 30 కోట్లకుపైగా సభ్యులు ఉన్నారని అమిత్ షా తెలిపారు. గత కొన్నేళ్లలో సహకార రంగాన్ని ఆధునిక సాంకేతికతతో అనుసంధానించి, పారదర్శకంగా, పోటీతత్వంతో పనిచేసే వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు అనేక సంస్కరణలు చేపట్టినట్లు చెప్పారు. సహకార ఉద్యమానికి కేంద్ర ప్రభుత్వం కొత్త ఊపిరి పోసిందని పేర్కొన్నారు. సహకార రంగం కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు ప్రత్యేక జీవ బీమా సంస్థను ఏర్పాటు చేయనున్నట్లు షా వెల్లడించారు. ఈ సంస్థ ద్వారా బీమా రంగంలో సహకార సంస్థల భాగస్వామ్యం మరింత పెరుగుతుందని తెలిపారు. ఇప్పటికే ఇఫ్కో భాగస్వామ్యంతో ఇఫ్కో-టోకియో బీమా రంగంలో సేవలందిస్తున్నప్పటికీ, కొత్త సంస్థతో



సహకార రంగానికి మరింత బలం చేకూరుతుందని అభిప్రాయపడ్డారు.

500 నగరాలకు భారత్ ట్యాక్సీ

సహకార నమూనాలో ప్రారంభించిన భారత్ ట్యాక్సీ సేవలు ఆశించిన ఫలితాలు ఇస్తున్నాయని అమిత్ షా పేర్కొన్నారు. ప్రస్తుతం ఢిల్లీ-ఎన్‌సీఆర్, గుజరాత్, ముంబై, లక్నో, జైపూర్, చండీగఢ్, కాన్పూర్ తదితర నగరాల్లో ఈ సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. త్వరలో రాంచీ, పాట్నా, గువాహటి, భోపాల్, కోల్‌కతా, ఇండోర్, నాగ్‌పూర్‌లకు విస్తరించి, అనంతరం రెండేళ్లలో దేశవ్యాప్తంగా 500 నగరాలకు తీసుకెళ్లనున్నట్లు వెల్లడించారు. సహకార సంస్థల్లో నిపుణుల నియామకాలు పూర్తిగా ప్రతిభ ఆధారంగా జరిగేలా చర్యలు తీసుకుంటామని షా తెలిపారు. దశలవారీగా వృత్తిపరమైన నిర్వహణను అమలు చేయడం ద్వారా నియామకాల్లో పారదర్శకత పెరగడంతో పాటు అవినీతికి అడ్డుకట్ట పడుతుందని చెప్పారు. దీంతో సహకార సంస్థలపై ప్రజల్లో విశ్వాసం మరింత బలపడుతుందన్నారు. పాడి, చక్కెర, ఎరువులు, బ్యాంకింగ్‌కే పరిమితమైన సహకార రంగం ఇప్పుడు విత్తనాల ఉత్పత్తి, రిటైల్, ఆరోగ్య సేవలు, ఇంధన పంపిణీ, డిజిటల్ సేవలు వంటి అనేక కొత్త రంగాల్లోకి ప్రవేశించిందని అమిత్ షా వివరించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్) 25కుపైగా వ్యాపార కార్యకలాపాలు నిర్వహించేలా అన్ని రాష్ట్రాలు నమూనా ఉప నియమాలను అమలు చేశాయని తెలిపారు.

వికసిత్ భారత్-2047లో కీలకపాత్ర

2047 నాటికి అభివృద్ధి చెందిన భారత నిర్మాణంలో సహకార రంగం కీలక పాత్ర పోషిస్తుందని షా విశ్వాసం వ్యక్తం చేశారు. సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించడం, చక్కెర, పాల పరిశ్రమల్లో సర్క్యులర్ ఎకానమీని అమలు చేయడం ద్వారా రైతులకు మెరుగైన ప్రత్యామ్నాయాలను అందించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు.

ఛార్జీల రాయితీ ముగిసినట్టే!

- పొడిగింపు ఉత్తర్వులు జారీ చేయని ఏఈఆర్‌ఏ
- మూడు నెలల గడువు ముగియడంతో అమల్లోకి సాధారణ టారిఫ్‌లు
- రాయితీ కొనసాగొద్దంటున్న విమానాశ్రయ నిర్వాహకులు



న్యూఢిల్లీ: దేశీయ విమానయాన సంస్థలకు ప్రధాన విమానాశ్రయాల్లో అమలుచేస్తున్న ల్యాండింగ్, పార్కింగ్ ఛార్జీలపై 25శాతం రాయితీ ఇక కొనసాగక పోవచ్చని తెలుస్తోంది. రాయితీ గడువును పొడిగిస్తూ ఎయిర్‌పోర్ట్స్ ఎకనామిక్ రెగ్యులేటరీ అథారిటీ (ఏఈఆర్ఏ) నుంచి ఇప్పటివరకు ఎలాంటి తాజా ఉత్తర్వులు వెలువడకపోవడంతో, మూడు నెలల మినహాయింపు గడువు ముగిసినట్టేనని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. దీంతో ప్రధాన విమానాశ్రయాల్లో మళ్లీ సాధారణ టారిఫ్‌లు అమల్లోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతల కారణంగా విమానయాన సంస్థలపై ఆర్థిక భారం పెరగడంతో, కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు ఏఈఆర్ఏ ఈ ఏడాది ఏప్రిల్ 7న ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది. వాటి ప్రకారం దేశంలోని ప్రధాన విమానాశ్రయాల్లో దేశీయ విమానాలకు వర్తించే ల్యాండింగ్, పార్కింగ్ ఛార్జీలను 25 శాతం మేర మూడు నెలల పాటు తగ్గించింది. విమానయాన సంస్థలకు తాత్కాలిక ఆర్థిక ఊరట కల్పించడమే ఈ నిర్ణయం ఉద్దేశం.

కొనసాగింపుపై స్పష్టత కరువు

రాయితీ కాలం ముగిసినప్పటికీ దానిని పొడిగించేలా కేంద్ర ప్రభుత్వం లేదా ఏఈఆర్ఏ నుంచి ఎలాంటి ఆదేశాలు అందలేదని విమానాశ్రయ నిర్వాహకులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో మినహాయింపు స్వయంగా ముగిసినట్లేనని, ఇకపై ముసుపటి టారిఫ్‌లే అమల్లోకి వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. అయితే దీనిపై కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఇప్పటివరకు అధికారిక ప్రకటన చేయలేదు.

వాల్‌స్ట్రీట్ గంట మోగించిన ట్రంప్

- స్టాక్ మార్కెట్ వృద్ధినే తన పాలన విజయంగా ప్రచారం
- ట్రంప్ అకౌంట్స్ ప్రారంభం



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం వైట్‌హౌస్‌లోని ఓవల్ ఆఫీస్ నుంచి న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజ్, నాస్‌డాక్ ట్రేడింగ్ ప్రారంభ గంటను మోగించారు. స్టాక్ మార్కెట్ పు రోగతిని తన ఆర్థిక విధానాల విజయంగా ప్రజలకు చాటిచెప్పే ప్రయత్నంలో భాగంగానే ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మార్కెట్ మరింత ఎగబాకుతుందని, అమెరికా ఆర్థిక వ్యవస్థ మరింత బలపడుతుందని ట్రంప్ ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పిల్లల కోసం రూపొందించిన ట్రంప్ అకౌంట్స్ పథకాన్ని ట్రంప్ ప్రారంభించారు. రిపబ్లికన్ల పన్ను, వ్యయ సంస్కరణల చట్టంలో భాగంగా తీసుకొచ్చిన ఈ పథకం ద్వారా చిన్నారుల పేర్లపై స్టాక్ ఇండెక్స్‌లలో పెట్టుబడులు పెట్టే అవకాశం కల్పించనున్నారు. భవిష్యత్ తరాలకు పెట్టుబడి సంస్కృతిని అలవాటు చేయడమే దీని ప్రధాన ఉద్దేశమని ట్రంప్ తెలిపారు.

ద్రవ్యోల్బణంతో తగ్గిన ప్రజాదరణ

అమెరికా ఆర్థిక వ్యవస్థలో స్టాక్ మార్కెట్ లాభాలు నమోదవుతున్నప్పటికీ, పెరుగుతున్న ద్రవ్యోల్బణం ట్రంప్ ప్రభుత్వానికి సవాల్‌గా మారింది. తాజా సర్వేల ప్రకారం ఆయన ఆర్థిక నాయకత్వాన్ని కేవలం మూడింట ఒక వంతు మంది మాత్రమే సమర్థిస్తున్నారు. గత ఏడాదితో పోలిస్తే వినియోగదారుల ధరల సూచీ కూడా పెరిగినట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ట్రంప్ అకౌంట్స్‌ను మరింత ముందుగానే ప్రారంభించి ఉంటే పిల్లలు ఇప్పటివరకు స్టాక్ మార్కెట్‌లో నమోదైన లాభాలను పొందే అవకాశం ఉండేదని ట్రంప్ వ్యాఖ్యానించారు.



రెడీ టు డ్రింక్ (ఆర్‌టీడీ) ఫ్రూట్ బెవరేజ్ విభాగంలో తన వ్యాపారాన్ని మరింత విస్తరించేందుకు ప్రముఖ పానీయాల తయారీ సంస్థ రస్నా కొత్త ఉత్పత్తిని మార్కెట్‌లోకి తీసుకొచ్చింది. జంపిన్ బ్రాండ్ పేరుతో 1 లీటర్ టెట్రా ప్యాక్‌ను దేశవ్యాప్తంగా విడుదల చేసింది. దేశంలో సుమారు రూ.1,000 కోట్ల విలువైన ఆర్‌టీడీ ఫ్రూట్ బెవరేజ్ మార్కెట్‌లో తన వాటాను పెంచుకోవాలనే వ్యూహంలో భాగంగానే ఈ ఉత్పత్తిని ప్రవేశపెట్టినట్లు సంస్థ వెల్లడించింది. ఇప్పటికే 125 మిల్లీలీటర్లు, 200 మిల్లీలీటర్ల పరిమాణాల్లో అందుబాటులో ఉన్న జంపిన్ ఉత్పత్తుల శ్రేణికి తాజాగా 1 లీటర్ ఫ్యామిలీ ప్యాక్‌ను జోడించారు. కుటుంబ వినియోగాన్ని దృష్టిలో ఉంచుకొని రూపొందించిన ఈ టెట్రా ప్యాక్‌లో విటమిన్-సీతో పాటు మొత్తం 10 రకాల విటమిన్లు, ఖనిజాలు సమృద్ధిగా ఉన్నాయని సంస్థ తెలిపింది.

ప్యారడైజ్ మూవీపై నాని ఫోకస్



నేచురల్ స్టార్ నాని హీరోగా, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ ది ప్యారడైజ్ పై ఇప్పటి భారీ అంచనాలు నెలకొన్నాయి. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత ఈ ఇద్దరి కాంబినేషన్‌లో వస్తున్న రెండో చిత్రం కావడంతో ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై నిర్మాత సుధాకర్ చెరురి భారీ బ్జడెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో నాని 'జడల్' అనే పూర్తి స్థాయి మాస్ పాత్రలో కనిపించనున్నారు. ఆయనకు జోడీగా కయాదు లోహర్ 'సుబ్బలక్ష్మి' పాత్రలో నటిస్తోంది. విలక్షణ నటుడు మోహన్ బాబు ప్రధాన ప్రతినాయకుడిగా కనిపించనుండగా, సోనాలి కులకర్ణి, రాఘవ్ జుయల్, సంపూర్ణేశ్ బాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా, జీ విష్ణు సినిమాటోగ్రఫీ, నవీన్ నూలి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మొదట ఈ సినిమాను ఆగస్టు 21న విడుదల చేయాలని భావించినప్పటికీ, నిర్మాణ పనులు ఆలస్యం కావడంతో విడుదల తేదీ సెప్టెంబర్ 25కు మారే అవకాశాలు ఉన్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ది ప్యారడైజ్‌పై పూర్తి దృష్టి పెట్టిన నాని, ఇతర సినిమాలను తాత్కాలికంగా పక్కన పెట్టినట్లు తెలుస్తోంది. షూటింగ్ ఆలస్యం కావడం వల్ల ఆయన రెండు ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను వదులుకోవాల్సి వచ్చినట్లు సమాచారం. మొదటిది, 'హాయ్ నాన్న' దర్శకుడు శౌర్యువ్ సిద్ధం చేసిన కొత్త సినిమా. కథ నచ్చినా డేట్స్ అందుబాటులో లేకపోవడంతో, ఆ ప్రాజెక్ట్‌ను వేరే హీరోతో ముందుకు తీసుకెళ్లాలని నాని సూచించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆ కథ విజయ్ దేవరకొండ వద్దకు వెళ్లినట్లు ప్రచారం జరుగుతోంది. ఇక రెండోది, 'జై భీవ్' దర్శకుడు టీజే జ్ఞానవేల్ రూపొందించాలనుకున్న చిత్రం. కథపై నానికి మంచి అభిప్రాయం ఉన్నప్పటికీ, డేట్స్ సర్దుబాటు కాకపోవడంతో ఈ కాంబినేషన్ కార్యరూపం దాల్చలేదని తెలుస్తోంది. ప్రస్తుతం జ్ఞానవేల్ హీరో సూర్యతో తన తదుపరి చిత్రాన్ని రూపొందిస్తున్నారు. 'ది ప్యారడైజ్' పూర్తయిన తర్వాత దర్శకుడు సుజీత్‌తో కలిసి 'బ్లడీ రోమియో' అనే సినిమా చేయాలని నాని భావిస్తున్నట్లు ఇండస్ట్రీలో టాక్ వినిపిస్తోంది. అయితే సుజీత్ ప్రస్తుతం పవన్ కళ్యాణ్‌తో 'ఓజీ–2' ప్రాజెక్ట్‌పైనా దృష్టి పెట్టడంతో, నాని–సుజీత్ సినిమా ఎప్పుడు ప్రారంభమవుతుందన్నది ఆసక్తికరంగా మారింది.నిర్మాతపై అదనపు ఆర్థిక భారం పడకుండా ఉండాలనే ఉద్దేశంతో నాని తన తదుపరి కమిట్‌మెంట్లను వాయిదా వేసి, 'ది ప్యారడైజ్'ను పూర్తి చేయడంపైనే పూర్తి దృష్టి సారించినట్లు సమాచారం.



నెట్‌ఫ్లిక్స్‌లో ఫిక్స్ అయిన పెద్ది

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కించిన 'పెద్ది' మూవీ ఓటిటి రిలీజ్ డేట్ కన్ఫామ్ అయ్యింది.థియేటర్లలో సూపర్ హిట్‌గా నిలిచిన ఈ చిత్రం ఇప్పుడు డిజిటల్ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. 'ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్ ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ తేదీని అధికారికంగా ప్రకటించింది. జూలై 9 నుంచి ఈ చిత్రం నెట్‌ఫ్లిక్స్‌లో అందుబాటులోకి రానుంది. తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో డా ఒసారి విడుదల చేయనున్నట్లు నెట్‌ఫ్లిక్స్ వెల్లడించింది. దీంతో థియేటర్లలో మిస్ అయిన ప్రేక్షకులు ఇంట్లోనే ఈ చిత్రాన్ని ఆస్వాదించే అవకాశం దక్కనుంది. విడుదలైన తొలి రోజు నుంచే 'పెద్ది'కి ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. గ్రామీణ నేపథ్యంలో స్పోర్ట్స్, ఎమోషన్, ఫ్యామిలీ డ్రామా అంశాలను సమతుల్యంగా మిళితం చేసిన బుచ్చిబాబు కథనం ప్రేక్షకులను ఆకట్టుకుంది. ముఖ్యంగా రామ్ చరణ్ నటన, పాత్రలోని తీవ్రత, భావోద్వేగ సన్నివేశాలు సినిమాకు ప్రధాన బలంగా నిలిచాయి. ప్రపంచవ్యాప్తంగా రూ.400 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించి ఈ చిత్రం రామ్ చరణ్ కెరీర్‌లో మరో భారీ విజయంగా నిలిచింది.



ఆసక్తిగా 'డిజిటల్ డెత్'


డిజిటల్ విప్లవం మన జీవితాలను మరింత సులభతరం చేసినప్పటికీ, అదే సమయంలో కొత్త తరహా సవాళ్లను కూడా తీసుకొస్తోంది. ఆధునిక ప్రపంచంలో మనిషి ఉనికిని కేవలం భౌతిక జీవితం మాత్రమే కాకుండా, డిజిటల్ వ్యవస్థల్లో నమోదయ్యే డేటా కూడా ప్రభావితం చేస్తోంది. ఒకవేళ సాంకేతిక లోపం కారణంగా బతికున్న వ్యక్తిని అధికారిక రికార్డుల్లో మరణించినట్లు చూపిస్తే పరిస్థితి ఎలా ఉంటుందనే వినూత్నమైన అంశంతో తెరకెక్కిన చిత్రం 'డిజిటల్ డెత్'. ఉత్కంఠభరితమైన కథాంశంతో రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. డిజిటల్ నేరాల నేపథ్యంలో సాగే భావోద్వేగభరిత సస్పెన్స్ థ్రిల్లర్‌గా 'డిజిటల్ డెత్' ప్రేక్షకుల ముందుకు వచ్చింది. 'లైఫ్ అప్‌లోడింగ్...' అనే ఉపశీర్షికతో తెరకెక్కిన ఈ సినిమా ప్రస్తుత తరం ఎదుర్కొంటున్న డిజిటల్ సమస్యలను ప్రతిబింబించేలా రూపొందించారు. ఈ చిత్రంలో చాందినీ చౌదరి ప్రధాన పాత్రలో నటించారు. నటనకు ప్రాధాన్యమున్న పాత్రలను ఎంపిక చేసుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న చాందినీ చౌదరి ఈ సినిమాలో భావోద్వేగాలతో కూడిన పాత్రలో కనిపించారు. టెక్నాలజీ యుగంలో డేటా భద్రత ప్రాధాన్యతను, చిన్న సాంకేతిక లోపాలు సాధారణ వ్యక్తుల జీవితాలపై ఎలాంటి ప్రభావం చూపగలవో ఈ సినిమా చూపించే ప్రయత్నం చేసింది. ఈ చిత్రానికి రామ్ మన్నార్ దర్శకత్వం వహించగా, ప్రవీణ్ కడియాల, అనిల్ కడియాల నిర్మించారు. నేటి డిజిటల్ నేరాలు, సాంకేతిక లోపాల ఆధారంగా రూపొందిన ఈ చిత్రం టెక్నాలజీ నేపథ్యంలో సాగే వైవిధ్యమైన సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రాలను ఇష్టపడే ప్రేక్షకులకు 'డిజిటల్ డెత్' మంచి ఎంపికగా నిలిచే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

10న 'లెనిన్' విడుదల



అక్కినేని అఖిల్ హీరోగా, అందాల తార భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటించిన చిత్రం 'లెనిన్'. మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా జూలై 10న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. అఖిల్ కెరీర్‌లో ఎంతో కీలకంగా భావిస్తున్న ఈ సినిమాపై ఇప్పటి భారీ అంచనాలు నెలకొన్నాయి. విడుదల తేదీ దగ్గరపడుతున్న నేపథ్యంలో చిత్రబృందం ప్రచార కార్యక్రమాలలో మరింత వేగవంతం చేసింది. ఇప్పటి విడుదలైన 'లెనిన్' ట్రైలర్ కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. ముఖ్యంగా యాక్షన్, ఎమోషన్స్, నాగార్జున వాయిస్ ఓవర్‌తో రూపొందిన ట్రైలర్ సినిమాపై ఆసక్తిని పెంచింది. తాజాగా ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ తేదీ, వేదికను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. జూలై 5న తిరుపతిలోని నెహ్రూ మున్సిపల్ గ్రౌండ్స్‌లో లెనిన్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను చిత్ర యూనిట్ ఘనంగా నిర్వహించనుంది. ఈ ఈవెంట్‌కు సంబంధించిన ఏర్పాట్లు ఇప్పటి ప్రారంభమైనట్లు తెలుస్తోంది.

రాజమౌళికి అరుదైన గౌరవం



తెలుగు సినిమా గ్లోబల్ స్థాయికి వెళ్ళిన దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళికి ఫ్రాన్స్‌లో మరొక అరుదైన గౌరవం దక్కింది. ఫ్రాన్స్ లోని లూమియర్ ఇన్స్టిట్యూట్, దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళిని ప్రత్యేకంగా సత్కరించింది. అక్కడి 'వాల్ ఆఫ్ ఫిల్మ్ మేకర్స్' పై ఇప్పటి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ దర్శకుల పేర్లు ఉన్నాయి. ఇప్పుడు రాజమౌళి పేరు డా ఆ జాబితాలో చేరింది. ఈ ప్రోగ్రామ్ లో రాజమౌళి తెరకెక్కించిన 'ఈగ', 'ఆర్ఆర్ఆర్' సినిమాలను ప్రదర్శించారు. 2012 లో విడుదలైన 'ఈగ', చిన్న కాన్సెప్ట్‌ను కొత్తగా చూపించిన సినిమాగా గుర్తింపు పొందింది. ఇక 'ఆర్ఆర్ఆర్' ప్రపంచవ్యాప్తంగా విడుదలై పలు అంతర్జాతీయ అవార్డులు అందుకోవడంతో పాటు, భారతీయ సినిమాపై విదేశీ ప్రేక్షకుల దృష్టిని మరింత ఆకర్షించింది. ఇటీవలే పారిస్ లోని 'సినీమాథెక్ ఫ్రాంకైస్' థియేటర్ లో రాజమౌళి పేరుతో శాశ్వత సీటును టాయించగా, ఇప్పుడు లూమియర్ ఇన్స్టిట్యూట్ జక్కన్న చిత్రాలతో ప్రత్యేక రెట్రోస్పెక్టివ్ ను నిర్వహిస్తుంది. 'బాహుబలి', 'ఈగ', 'ఆర్ఆర్ఆర్' లాంటి చిత్రాలను ప్రదర్శిస్తూ, భారతీయ సినిమాలపై అంతర్జాతీయ ప్రేక్షకుల్లో ఆసక్తి ఎలా పెరుగుతోందో ఈ కార్యక్రమం మరోసారి చూపిస్తుంది.

శరవేగంగా 'స్పిరిట్'

రెబల్ స్టార్ ప్రభాస్, సెన్సేషనల్ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'స్పిరిట్' షూటింగ్ శరవేగంగా కొనసాగుతోంది. భారీ అంచనాల మధ్య రూపొందుతున్న ఈ చిత్రానికి సంబంధించిన తాజా అప్‌డేట్ అభిమానుల్లో మరింత ఆసక్తిని పెంచుతోంది. ప్రస్తుతం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ జెట్ స్పీడ్‌లో సాగుతుండగా.. చిత్ర బృందం ఎలాంటి విరామం లేకుండా వరుస షెడ్యూళ్లతో దూసుకెళుతోంది. స్పిరిట్ షూటింగ్‌లో ఇప్పటి దాదాపు 70 శాతం పూర్తయినట్లు, వలం 30 శాతం చిత్రీకరణ మాత్రమే మిగిలి ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సినిమా కోసం ప్రభాస్ డా పూర్తిస్థాయిలో సమయం టాయిస్తూ.. ప్రతి యాక్షన్ సన్నివేశాన్ని డూప్ లేకుండా స్వయంగా చేస్తున్నారని సమాచారం. యాక్షన్ సీక్వెన్స్‌లలో ప్రభాస్ అంకితభావం చిత్ర యూనిట్‌ను డా ఆకట్టుకుంటోందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇక దర్శకుడు సందీప్ రెడ్డి వంగా పనితీరు గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ప్రీ–ప్రొడక్షన్ దశలోనే ప్రతి సన్నివేశాన్ని, షూటింగ్ షెడ్యూల్‌ను పక్కాగా సిద్ధం చేసుకునే ఆయన.. సెట్స్‌పైకి వెళ్లిన తర్వాత మాత్రం శరవేగంగా చిత్రీకరణ పూర్తి చేసే దర్శకుడిగా పేరొందాడు. 'స్పిరిట్' విషయంలోనూ అదే మ్యీహాన్ని అమలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ముందస్తు ప్రణాళిక కారణంగానే షూటింగ్ ఎలాంటి ఆటంకాలు లేకుండా వేగంగా కొనసాగుతోందని సమాచారం.



ఫ్యాన్స్‌కు రవితేజ సర్‌ప్రైజ్!

మాస్ మహారాజా రవితేజ కథానాయకుడిగా దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న 'ఇరుముడి' చిత్రంపై ఇప్పటికే ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. ఈ సినిమాలో ప్రియా భవానీ శంకర్ కథానాయికగా నటిస్తుండగా, తాజాగా ఈ చిత్రంలో ఓ సర్‌ప్రైజింగ్ ఎలిమెంట్ ఉందనే వార్త సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. 'ఇరుముడి'లో ప్రత్యేక గెస్ట్ రోల్ ఒకటి ఉండబోతుందని సమాచారం. కమర్షియల్ అంశాలను దృష్టిలో పెట్టుకుని శివ నిర్వాణ ఈ గెస్ట్ రోల్‌ను కథలో భాగంగా చేర్చినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా రవితేజ పాత్రతో ఈ గెస్ట్ రోల్ మధ్య కొన్ని కీలక సన్నివేశాలు కూడా ఉండనున్నాయని సమాచారం. కాగా, ఈ సినిమా గురించి గతంలో రవితేజ మాట్లాడుతూ, "కొన్ని కథలు జీవితంలో సరైన సమయంలో మనల్ని ఎంచుకుంటాయి. అలాంటి కథే 'ఇరుముడి'. ఇందులో భాగం కావడం అదృష్టంగా భావిస్తున్నాను. ఈ కొత్త ప్రయాణంపై చాలా ఉత్సాహంగా ఉన్నాను" అని పేర్కొన్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్ సంగీతం అందిస్తున్నారు. మరో ఆసక్తికర అంశంగా బేబీ నక్షత్ర ఈ చిత్రంలో రవితేజ కుమార్తె పాత్రలో నటిస్తోంది.

జన్మభూమిపై పుకార్లు



బాలీవుడ్ స్టార్ నటుడు సల్మాన్ ఖాన్ నటిస్తూ.. అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న తాజా చిత్రం 'మాతృభూమి'. వార్ డ్రామాగా వస్తున్న ఈ సినిమా సెన్సార్ బోర్డ్ వద్ద నిలిచిపోయిందని, సర్టిఫికేషన్ ప్రక్రియలో సమస్యలు ఎదుర్కొంటుందంటూ మీడియాలో వస్తున్న పలు థనాలపై స్పందించింది చిత్రబృందం. మీడియాలో వస్తున్న వార్తలను అవాస్తవాలని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా సోషల్ మీడియా వేదికగా పోస్ట్ పెట్టింది. 'మాతృభూమి' సినిమా సెన్సార్ బోర్డు వద్ద ఇబ్బందులు ఎదుర్కొంటోందని వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని మేకర్స్ స్పష్టం చేశారు. అసలు ఈ సినిమాను ఇప్పటివరకు సెన్సార్ సర్టిఫికేషన్ కోసం సీబీఎఫ్‌సీకి సమర్పించనేలేదని, అలాంటప్పుడు పక్రియ నిలిచిపోయిందనే ప్రచారానికి అర్థం లేదని వారు తేల్చి చెప్పారు. మీడియా సంస్థలు మరియు సోషల్ మీడియా వినియోగదారులు ఇలాంటి సమాచారాన్ని, పుకార్లను షేర్ చేయవద్దని విజ్ఞప్తి చేశారు. సినిమాకు సంబంధించిన ఎలాంటి అధికారిక అప్‌డేట్స్ అయినా సల్మాన్ ఖాన్ ఫిల్మ్స్ అధికారిక ఛానెల్స్ ద్వారా మాత్రమే పంచుకుంటామని వారు స్పష్టం చేశారు. అంతకుముందు ఈ చిత్రం ఈద్ కానుకగా ఏప్రిల్ 17న విడుదల కావాల్సి ఉండగా, కొన్ని కారణాల వల్ల వాయిదా పడింది. ఆ తర్వాత స్వాతంత్య్ర దినోత్సవ కానుకగా ఆగస్ట్‌లో విడుదల చేయాలని ప్లాన్ చేశారు. అయితే తాజా పరిస్థితులను బట్టి చూస్తే ఈ చిత్రం ఆగస్ట్ రేస్ నుండి కూడా తప్పుకుని మరింత ఆలస్యమయ్యేలా కనిపిస్తోంది. ఈ చిత్రానికి అపూర్వ లఖియా దర్శకత్వం వహిస్తుండగా, సల్మాన్ ఖాన్ హోవ్ బ్యానర్‌పై సల్మా ఖాన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మొదట ఈ సినిమాకు 'బాటిల్ ఆఫ్ గల్వాన్' అనే టైటిల్‌ను అనుకున్నారు. వివాదాల నేపథ్యంలోనే చిత్ర బృందం టైటిల్‌ను 'బాటిల్ ఆఫ్ గల్వాన్' నుండి 'మాతృభూమి'గా మార్చింది.

నా లైఫ్ పార్ట్‌నర్ సెన్సిబుల్‌గా ఉండాలి

టాలీవుడ్ మోస్ట్ వాంటెడ్ అండ్ ఎనర్జిటిక్ బ్యూటీ శ్రీలీల పెళ్లి, రిలేషన్‌షిప్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్న బ్యూటీ.. తనకు కాబోయే వాడు ఎలా ఉండాలి? తన లైఫ్ పార్ట్‌నర్‌లో ఎలాంటి క్వాలిటీస్ వెతుకుతుంది? అనే విషయాలపై తాజాగా క్లారిటీ ఇచ్చింది. ఒక ఇంటర్వ్యూలో శ్రీలీలను రిలేషన్‌షిప్ గురించి అడగగా, తన మనసులోని మాటను పంచుకుంది. తనకు కాబోయే వాడు ముఖ్యంగా మూడు లక్షణాలు కలిగి ఉండాలని స్పష్టం చేసింది. 'నాకు లైఫ్ పార్ట్‌నర్‌గా వచ్చే వ్యక్తి చాలా సెన్సిబుల్‌గా ఉండాలి. అలాగే ఇతరుల భావాలను గౌరవించే సెన్సిటివ్ మనస్తత్వం ఉండాలి. వీటన్నింటితో పాటు మోస్ట్ ఇంపార్టెంట్ క్వాలిటీ.. అతనికి మంచి సెన్స్ ఆఫ్ హ్యూమర్ కచ్చితంగా ఉండాలి' అని శ్రీలీల పేర్కొంది. వలం లుక్స్ మాత్రమే కాకుండా, వ్యక్తిత్వానికి, ఎదుటివారిని అర్థం చేసుకునే గుణాని తాను మొదటి ప్రాధాన్యత ఇస్తానని ఈ బ్యూటీ హింట్ ఇచ్చేసింది. ప్రస్తుతం శ్రీలీల చేసిన ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. గ్లామర్, యాక్టింగ్, అదిరిపోయే డాన్స్‌లతో కుర్రకారు మనసు దోచుకున్న ఈ ముద్దుగుమ్మ.. రిలేషన్‌షిప్ విషయంలో ఇంత క్లారిటీగా ఉండటంపై ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. శ్రీలీల చెప్పిన క్వాలిటీస్ విన్నాక.. 'బాస్.. ఆ క్వాలిటీస్ మనలో ఉన్నాయో లేదో ఒకసారి చెక్ చేసుకోవాల్సిందే' అంటూ నెటిజన్లు, అబ్బాయిలు సోషల్ మీడియాలో సరదా కామెంట్స్ పెడుతున్నారు.



Published and Editor Owned by Adula Thirupathi, and Printed by vattemula Rama krishna, RK Printers Mig 11, Block No 16, Ground Floor 4, Baghlingampally, Hyderabad 500044. Telangana State. and Published from 16-11-13/A, saleemnagar colony, Malakpet, Hyderabad, Telangana State. **Editor: Adula Thirupathi. RNI NO : TGTEL/25/A4244** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277